PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి....



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 222, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, శుక్రవారం - 02 - అక్టోబర్ - 2026 , వెల రూ.5/-

# విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నాం

- వస్త్ర పరిశ్రమకు సిరిసిల్ల అడ్డా
- అగ్గిపెట్టెలో చీరను మడతపెట్టే నైపుణ్యం ఇక్కడి నేత కార్మికుల ప్రత్యేకత
- “మనిషి నాగరికత వస్త్రంతో ప్రారంభమైంది
- ప్రమాదవశాత్తు కార్మికులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలను ఆదుకోవడానికి రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించే ప్రత్యేక విధానం అమలు చేస్తున్నాం



హైదరాబాద్: ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన -- ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి సిరిసిల్ల పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. మిగతా 2 లో

# ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నాం

## ప్రతి నెలా నాలుగు సార్లు ప్రజల ముందుకు వస్తున్నాం

- ★“చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నా
- ★గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం
- ★సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం
- ★ల్లఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, 9న మీ భూమి-మీ హక్కు, ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, నాలుగో శనివారం సంజీవని కార్యక్రమం



రేపల్లె: పేదలకు న్యాయం చేయాలనే బాధ్యతతో పనిచేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి నెలా నాలుగు సార్లు ప్రజల ముందుకు వస్తున్నామని చెప్పారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, 9న మీ భూమి-మీ హక్కు, ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, నాలుగో శనివారం మిగతా 2 లో

# బీసీలకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

- ★రేపల్లె ప్రజావేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత
- ★ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రేపే సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్తున్నట్లు వెల్లడి
- ★బాపట్ల జిల్లాలో సూర్యలంక బీచ్‌ను గోవా తరహాలో అంతర్జాతీయ పర్యాటక ల్యాండ్‌మార్క్‌గా అభివృద్ధి చేస్తామని ప్రకటన



బాపట్ల జిల్లా రేపల్లె: బీసీలకు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా అండగా నిలిచింది... నిలిచేది తామేనని ముఖ్యమమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. బీసీలకు చేయూతను అందించే విషయంలో ఎక్కడా రాజీ పడబోమని తేల్చి చెప్పారు. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును మిగతా 2 లో



## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు

ఏపీ స్థానిక ఎన్నికలపై హైకోర్టు కీలక తీర్పు.. 34% బీసీ రిజర్వేషన్లు రద్దు!

మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని హైకోర్టు స్పష్టీకరణ

ఆరు వారాల్లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశం

వార్డుల పునర్విభజన, ఇతర అంశాలపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన ధర్మాసనం

# లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ: ప్రధాని మోదీ

## యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ

- స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌ను ఆవిష్కరించిన ప్రధాని
- లక్షలాది మంది యువత ఆశయాలకు యూపీఎస్సీ ప్రతీక అని వ్యాఖ్య
- సర్దార్ పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలను స్మరించుకున్న ప్రధాని
- భారత పైలట్ స్మిత్ ధైర్యాన్ని కొనియాడిన మోదీ



ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మిగతా 2 లో



## ఆపరేషన్ త్రిశూల్’ ప్రదర్శన స్టాల్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

జిల్లాలో గంజాయి కట్టడికి 661 ఈగిల్ క్లబ్‌ల ఏర్పాటు, 287 కిలోల గంజాయి సీజ్ చేసినట్లు వెల్లడించిన జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్

మహిళలపై నేరాలు 22.55%, పోక్సో కేసులు 50%, హెల్మెట్

# సీఎం రేవంత్ పాదయాత్రకు నీరాజనం

## పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది



- భారీగా తరలివచ్చిన యువత
- సుమారు 3 కిలోమీటర్ల మేర 40 నిమిషాల పాటు కొనసాగిన పాదయాత్ర
- దారిపొడవునా స్థానిక మహిళలు, నేత కార్మికులు సీఎంకు మంగళహారతులు, బోనాలతో ఘన స్వాగతం

కరీంనగర్: ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అడుగుపెట్టారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రులతో మిగతా 2 లో

## ‘9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు’.. కెప్టెన్ స్మిత్‌పై మోదీ ప్రశంసలు



- స్మిత్ అసాధారణమైన ధైర్యాన్ని ప్రదర్శించారని కితాబు
- ఇప్పటికే స్మిత్‌ను ‘హీరో’గా అభివర్ణించిన మోదీ
- తీవ్ర విషాదాన్ని ఆపారంటూ నెతన్యాహు సైతం ప్రశంసలు
- ప్రస్తుతం సౌదీలో చికిత్స పొందుతున్న స్మిత్
- ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు అధికారుల వెల్లడి

## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు... రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత



### స్తంభింపజేసిన టీఎంసీ ఖాతాలపై మమతా వర్గం పిటిషన్ కొట్టివేత

- నాలుగు బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ. 804 కోట్ల నిధులపై విచారణ
- హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- పార్టీలో వర్గపోరు తేలేవరకు నిధులపై నిర్ణయం కష్టమన్న ధర్మాసనం
- కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టుకు సూచన



## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ ఈసీపై దాడి చేస్తోందని ఆరోపణ
- హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ దొంగ ఓట్లను చేర్పించే ప్రయత్నం చేస్తోందని విమర్శ
- బీఆర్ఎస్‌తో పొత్తు, ఖైరతాబాద్‌లో బీజేపీ పోటీపై కిషన్ రెడ్డి ఏమన్నారంటే?

హైదరాబాద్: ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా?: సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!



- రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ సవాల్
- రెండు కుటుంబాల ఆస్తులపై విచారణకు డిమాండ్
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని కోరిన కేటీఆర్
- తప్పు తేలితే శిక్షకు సిద్ధమన్న కేటీఆర్
- ప్రభుత్వ హామీలపై పోరాటం కొనసాగిస్తామన్న కేటీఆర్

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో

# సంపాదకీయం

## పుస్తకం 'ఉత్త' భూషణం

'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్ బూనితిన్' అంటూ సరస్వతీ ప్రార్థనతో ఒక చాటుపద్యం ప్రారంభమవుతుంది. 'నువ్వు నా మనసులో నిలిచి, మంచి, అందమైన మాటల్ని ధారగా ఇష్టంగా నాతో పలికించ'మని ఆ పద్యకవి ఆమెను ప్రార్థిస్తాడు. 'జగత్తునే మోహపెట్టేదిగా, విప్పారిన కన్నులూ, పూర్ణచంద్రునివంటి ముఖమూ కలిగినదిగా' ఆమెను సంబోధిస్తాడు. మరో కోణంలో ఈ పద్యం పుస్తకమెలా ఉండాలో చెబుతోంది-- అది వాగ్ధారతోనే కాక, ఆ వాక్కులు మంచివిగానూ, అందంగానూ ఉండాలంటోంది. సరస్వతికి ఉపయోగించిన విశేషణాలను పుస్తకానికి కూడా అన్వయిస్తే, అది పాఠకజగత్తును మోహపెట్టేలా, వారి చూపుల్ని విశాలపరిచేలా, పూర్ణచంద్రుడిలా ఆహ్లాదం గొలిపేలా ఉండాలి. పుస్తకమెలా ఉండాలో చెప్పడమంటే, ఎలా ఉండకూడదో చెప్పడమే. పుస్తకాన్ని దేవతతో ముడిపెట్టడమంటేనే, దానికి పవిత్రతను ఆపాదించడం!. అందం, ఆహ్లాదం, పవిత్రతా వగైరాలనలా ఉంచితే, పుస్తకంపట్ల కనీసమైన భక్తి శ్రద్ధలను, బాధ్యతను చాటుకుంటున్నామా? తొలినాటి వాగ్రూపదశ దాటి, లేఖనంతో మొదలైన తాళపత్రాలు, భూర్జపత్రాలదశలోకీ కాగితం దశలోకీ అడుగుపెట్టి అక్కడి నుంచి తాజాగా ఆడియో పుస్తకాల రూపంలో మరోసారి వాగ్రూపానికి చేరుకున్న ఇన్ని వందల, వేల సంవత్సరాల వ్యవధిలో కూడా పుస్తకరచననూ, ప్రచురణనూ ఉన్నత ప్రమాణాలు కలిగిన ఒక వ్యవస్థగా మనం పూర్తిగా అభివృద్ధి చేసుకోగలిగామా? సినిమా వంటి నిన్నమొన్నటి జనమాధ్యమాలతో పోటీపడే స్థాయిలో పుస్తకాన్ని జనసామాన్యంలోకి తీసుకెళ్ళగలిగామా? కవులు, రచయితలకిచ్చే గుర్తింపును-- నటులకు, నాయకులకు ఇచ్చే గుర్తింపులో సగానికైనా పెంచగలిగామా? ఇప్పుడు మరింత ఎక్కువమందికి అందు బాటులోకి వచ్చిన పుస్తకం ద్వారా జ్ఞాన, విజ్ఞాన, సారస్వతవ్యాప్తిలో మరింత పురోగ మనాన్ని సాధించే బదులు తిరోగమనాన్ని చిత్తగించిన దాఖలాల సంగతేమిటి?! . సరస్వతిలానే ప్రకృతి కూడా తల్లే. ఆ తల్లి జీవపరిణామ క్రమంలో మనిషికి మెదడు నిచ్చింది; ఆ మెదడు జ్ఞాన, విజ్ఞాన, సారస్వతావిష్కారాల వైపు మనిషిని నడిపించింది; మెదడుకు సమాంతరంగా ప్రకృతి ప్రసాదించిన మాట ఆ జ్ఞాన, విజ్ఞానాదులను తోటి మనిషితో పంచుకునే సౌలభ్యమిచ్చింది. అప్పటినుంచీ జ్ఞాన, విజ్ఞానవ్యాప్తిలో మనిషి మడమ తిప్పింది లేదు. వాక్కునే జ్ఞానవాహిక చేసుకుని మాటలల్లి, వాటికి ఆటపాటలు జోడించి జనంలోకి తీసుకెళ్ళి భావి కావ్యేతిహాసాలకు బీజావాపం చేసిన చరిత్ర మనిషిది. ఆదికవి నన్నయ భట్టు తన ఆంధ్రమహాభారత కృతిభర్త రాజరాజనరేంద్రుని ఆస్థానాన్ని వర్ణిస్తూ-- అపార శబ్దశాస్త్రపారగులైన వైయాకరణులు, భారతరామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులు, నవార్థవచనరచనా విశారదులైన మహాకవులు, సమస్తశాస్త్ర సాగర గరీయ ప్రతిభులైన తార్కికులు మొదలైన విద్వజ్జనాలు ఆయనను పరివేష్ఠించి ఉన్నారంటాడు. శ్రీనాథ మహాకవి విజయనగరంలో ప్రౌఢదేవరాయల ఆస్థాన పండితు డైన గౌడడిండిమ భట్టును శాస్త్రవాదంలో ఓడించి అతని కంచుఢక్కను పగులగొట్టించడం మరో ప్రసిద్ధ ఉదాహరణ. ఏ జ్ఞానరంగంలోనైనా అపశబ్దాలు, అపరిణతులు, అతర్కాలు, కుతర్కాలు చోటు చేసుకోకుండా ఆనాటి గురువులతోపాటు, పండితపరిషత్తులు అంకుశంలా పనిచేస్తూ జ్ఞానస్వచ్ఛతను పరిరక్షించడానికి ప్రయత్నించాయి. ఇప్పటి పుస్తక ప్రచురణ భాషలో చెప్పాలంటే 'పరిష్కర్త' పాత్రను నిర్వహించాయి. అటువంటిది, కాగితమూ, అచ్చుయంత్రమూ అందుబాటులోకి రావడంతో పుస్తకరూపం ధరించిన జ్ఞానం పండిత పరిషత్తు లనూ, రాజాస్థానాలను దాటి వందల సంవత్సరాల క్రితమే ప్రజాస్థానంలోకి అడుగు పెట్టినా, మనదేశంలో ఇప్పటికీ పుస్తకప్రచురణ ఉన్నత ప్రమాణాలు కలిగిన వ్యవస్థగా అభివృద్ధి చెందకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? పుస్తకమూ, పుస్తక రచనా ప్రజాస్వామికమవుతూ అన్ని వర్గాలకూ అందుబాటులోకి రావడం శుభపరిణామ మను కుంటే; 'పరిష్కర్త' రూపంలో అంకుశం లోపించి నాణ్యత అడుగంటడాన్ని ఎలా చూడాలి? దాంతో పుస్తకాలు అనేకం అమ్ముకునే స్థాయికి చేరకుండా ఉచితంగా పంచి పెట్టే స్థాయిలోనే ఉండిపోతున్నాయి. దాని ప్రభావం మంచి పుస్తకాలపైనా పడుతోంది. ఇప్పటికైనా మేలుకుని ప్రచురణ రంగాన్ని ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుకోకపోతే హస్తభూషణం కావలసిన పుస్తకం 'ఉత్త' భూషణంగానే ఎప్పటికీ ఉండిపోతుంది.

## '9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్న భారతీయుడు'.. కెప్టెన్ స్మిత్‌పై మోదీ ప్రశంసలు

ఢిల్లీ: ఫ్లైదుబాయ్ విమానంలో పెను ప్రమాదాన్ని అడ్డుకున్న భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చార్‌పై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. తీవ్రంగా గాయపడినా సమయస్ఫూర్తి, ధైర్యంతో వ్యవహరించి 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నారని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరిగిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ శతాబ్ది వేడుకల్లో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "కెప్టెన్ స్మిత్ అసాధారణమైన సహనం, సమయస్ఫూర్తి, ధైర్యాన్ని ప్రదర్శించారు. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లు.. ఒక భారతీయుడు 9/11 తరహా విషాదాన్ని అడ్డుకున్నాడు" అని మోదీ పేర్కొన్నారు. అంతకుముందు కూడా స్మిత్‌ను 'హీరో'గా అభివర్ణించిన ప్రధాని.. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు బుధవారం బయలుదేరిన ఫ్లైదుబాయ్ ఎఫ్‌జెడ్1073 విమానంలో కాక్‌పిట్‌లో ఇద్దరు పైలట్ల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. స్మిత్ మచ్చార్‌పై దాడి చేసి కో-పైలట్ విమానాన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో విమానం ఒక్కసారిగా భారీగా కిందకు దిగొచ్చింది. దాదాపు 17,000 అడుగుల ఎత్తు ఒక్క నిమిషంలోనే కోల్పోయినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ వివరాలు వెల్లడించాయి. తీవ్రంగా గాయపడిన స్మిత్ మచ్చార్ కాక్‌పిట్ తలుపు తెరిచేందుకు ప్రయత్నించడంతో ప్రయాణికులు, సిబ్బంది లోపలికి వెళ్లగలిగారు. అనంతరం దాడికి పాల్పడిన కో-పైలట్‌ను అదుపులోకి తీసుకున్నారు. విమానాన్ని సౌదీ అరేబియాలోని తబూక్‌కు మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలో 174 మంది ఉన్నారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కూడా స్మిత్ ధైర్యాన్ని ప్రశంసించారు. ఆయన చర్యల వల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్ర విషాదానికి దారితీసే ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. స్మిత్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో చికిత్స పొందుతున్నారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు భారత అధికారులు తెలిపారు.

## సీఎం రేవంత్ పాదయాత్రకు నీరాజనం

కరీంనగర్: ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారిగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అడుగుపెట్టారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల నియోజకవర్గంలో మంత్రులతో కలిసి సీఎం నేతృత్వంలో నిర్వహించిన పాదయాత్ర కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. అంబేడ్కర్ చౌక్ నుంచి బహిరంగ సభాస్థలి వరకు సుమారు 3 కిలోమీటర్ల మేర 40 నిమిషాల పాటు కొనసాగిన పాదయాత్రకు కాంగ్రెస్ కార్యకర్తలు, యువత భారీగా తరలివచ్చారు. దారిపొడవునా స్థానిక మహిళలు, నేత కార్మికులు సీఎంకు మంగళహారతులు, బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఎత్తయిన భవనాలు ఎక్కి ముఖ్యమంత్రి వైపు చేతులు ఊపుతూ సంబరపడ్డారు. ర్యాలీలో యువకులు భారీగా పాల్గొన్నారు. సీఎంతో ఫొటోలు దిగడానికి పోటీపడ్డారు. కాంగ్రెస్ శ్రేణుల నినాదాలతో సిరిసిల్ల వీధులు మార్మోగాయి. రేవంత్‌రెడ్డి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. దారిలో కొంతమంది మహిళలు వినతిపత్రాలతో నిలబడగా.. సీఎం వారి వద్దకు వెళ్లి తీసుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాదయాత్రలో ఆద్యంతం ఉత్సాహంగా కనిపించారు. డ్యాన్స్ చేస్తూ.. యువతను ఉత్సాహపరుస్తూ ముందుకు సాగారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు పాదయాత్రలో పాల్గొన్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా రూ.345.78 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పెద్దూరులో రూ.5 కోట్లతో నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవనాన్ని ప్రారంభించారు. రూ.15.25 కోట్లతో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, తంగళ్లపల్లి, వీర్నపల్లి, రుద్రంగి, వేములవాడ మండలాల రెవెన్యూ కార్యాలయాల నిర్మాణానికి శ్రీకారం. సిరిసిల్ల పట్టణం, కోనరావుపేట మండల కేంద్రంలో రూ.16.13 కోట్లతో నిర్మించనున్న తెలంగాణ పబ్లిక్ స్కూళ్లకు శంకుస్థాపన.

సిరిసిల్లలో రూ.200 కోట్లతో నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, రాజన్న ఆలయంలో ఫేజ్-1లో రూ.99.4 కోట్లతో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శ్రీకారం. రుద్రంగిలో 10 వేల టన్నుల సామర్థ్యంతో రూ.10 కోట్లతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ నిర్మించనున్న గోదాం, సిరిసిల్లలో చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో నేత బజారు పనులకు శంకుస్థాపన. వేములవాడలో మహిళా పోలీస్‌స్టేషన్, వేములవాడ, సిరిసిల్లలో రెండు ట్రాఫిక్ ఠాణాలకు శంకుస్థాపన.

## ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని పనిచేస్తున్నాం: సీఎం చంద్రబాబు

రేపల్లె: పేదలకు న్యాయం చేయాలనే బాధ్యతతో పనిచేస్తున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ప్రతి నెలా నాలుగు సార్లు ప్రజల ముందుకు వస్తున్నామని చెప్పారు. ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ, 9న మీ భూమి-మీ హక్కు, ప్రతి మూడో శనివారం స్వచ్ఛాంధ్ర, నాలుగో శనివారం సంజీవని కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు సీఎం తెలిపారు. గత 28 నెలలుగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటున్నట్లు వివరించారు. బాపట్ల జిల్లా రేపల్లెలో నిర్వహించిన పింఛన్ల పంపిణీలో సీఎం పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. "చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నా. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నా. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతి వ్యక్తికి, ప్రతి కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఎన్నికల్లో ప్రజలు కొట్టిన దెబ్బకు గొడ్డలి పార్టీ నేతలు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు. సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటి వరకు రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు ఉంది. బుల్లెట్ స్పీడ్‌తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాకుండా మానవీయ కోణంలో ఆలోచించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున ఉన్న వారికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలను పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని చంద్రబాబు అన్నారు.

# బీసీలకు అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అప్పీలుకు వెళ్లనున్నట్లు తెలిపారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ప్రజావేదికలో సీఎం ప్రసంగించారు. నాడు బీసీలకు రాజకీయంగా ఎన్టీఆర్ గుర్తింపు తెచ్చారని.. తాను వారికి అండగా నిలబడి ప్రోత్సహించానని సీఎం అన్నారు. 1995లో స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు తెచ్చామని ముఖ్యమంత్రి వెల్లడించారు. గొడ్డలి పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వేషన్లను 24 శాతానికి కుదించిందన్నారు. తద్వారా 16,800 మంది పదవీ అవకాశాలు కోల్పోయారని ముఖ్యమంత్రి అన్నారు. దీనిపై సీఎం మాట్లాడుతూ.." ఇప్పుడు మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తే గొడ్డలి పార్టీ కోర్టుకు వెళ్లింది. హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేసింది. 50 శాతం కంటే రిజర్వేషన్లు పెరగకూడదని కోర్టులో వాదించారు. కోర్టు ఆ జీవోలను కొట్టేసింది. దీనిపై రేపే ఈ సుప్రీం కోర్టులో అప్పీలుకు వెళ్తున్నాం. వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా పైకి తీసుకురావటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. ఒక్క టీచర్ ఉద్యోగం కూడా ఇవ్వని వ్యక్తులు.. మేం మెగా డీఎస్సీ తో ఉద్యోగాలు ఇస్తే ఆరోపణలు చేస్తున్నారు. 350 కేసులు కోర్టుల్లో వేసి నియామక ప్రక్రియను అడ్డుకునే ప్రయత్నం చేశారు. వెనుకబడిన వర్గాలపై ద్వేషంతో కోర్టులకు వెళ్లి అడ్డంకులు సృష్టించే రిజర్వేషన్లు రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏది ఏమైనా బీసీలను రాజకీయంగా అండగా నిలబడే బాధ్యతను మేం తీసుకుంటాం. ఈ ప్రాంతంలో బీసీ బిడ్డ అనగాని భగవంతరావు చక్కగా పనిచేశారు. ఇప్పుడు మంత్రిగా అనగాని సత్యప్రసాద్ ప్రజల కోసం పనిచేస్తున్నారు. బీసీలుగా నాయకులు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించేది కూటమి ప్రభుత్వమే." అని ముఖ్యమంత్రి అన్నారు.

జీవన ప్రమాణాలు పెంచటమే లక్ష్యం

"గడచిన 28 నెలలుగా ప్రతీ నెలా మొదటి తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కార్యక్రమంలో పాల్గొంటున్నాను. చీఫ్ మినిస్టర్ అంటే కామన్ మ్యాన్ అని నేను విశ్వసిస్తున్నాను. ప్రజల కష్టాలు, సమస్యలు తెలుసుకుంటూ పనిచేస్తున్నాను. పేదలకు న్యాయం చేయాలన్న బాధ్యతతో మేం పనిచేస్తున్నాం. ప్రతినెలా నాలుగు మార్లు ప్రజల ముందుకు వస్తున్నాం. ప్రతీ నెలా 1 తేదీన పేదలకు ఆర్థిక భద్రత కల్పించే పెన్షన్ల కార్యక్రమం, 9 తేదీన మీ భూమి- మీహక్కు కార్యక్రమంలో పాల్గొంటున్నాం. గత పాలకులు సృష్టించిన భూ వివాదాలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నాం. ఇక ప్రతిమూడో శనివారం పర్యావరణాన్ని కాపాడే స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి , 4వ శనివారం సంజీవని కార్యక్రమానికి హాజరవుతున్నాను. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా తీసుకుని నిత్యం ప్రజా సేవకులుగా పనిచేస్తున్నాం. గడచిన రెండేళ్లుగా ప్రతీ వ్యక్తికి, ప్రతీ కుటుంబానికి సాధికారిత తీసుకువస్తున్నాం. రాష్ట్రంలో ఆ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. గొడ్డలి పార్టీ నేతలు ప్రజలు కొట్టిన దెబ్బకు అలిగి అసెంబ్లీకి కూడా రాకుండా ముఖం చాటేస్తున్నారు. గత పాలకులు అన్ని వ్యవస్థల్నీ భ్రష్టు పట్టించారు. రాష్ట్రాన్ని విధ్వంసం సృష్టించారు. కష్టంతో సంకల్పంతో ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒక్కో ఇటుకా పేరుస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్త?న్నాం. ఆర్థిక సవాళ్లు అధిగమించి సంక్షేమం అందిస్తున్నాం. పెన్షన్లకే ఇప్పటికి రూ.76 వేల కోట్లు ఖర్చు చేశాం. వెంటిలేటర్ పై ఉన్న ఆర్థిక వ్యవస్థను కేంద్ర సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపిస్తున్నాం. కేంద్రంలో, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు, బుల్లెట్ స్పీడ్ తో సుపరిపాలన అందిస్తున్నాం. పేదరికాన్ని ఆర్థిక కోణంలో కాదు మానవీయ కోణంలో ఆలోచించి జీవన ప్రమాణాలు పెంచడానికి చూస్తున్నాం. సంక్షేమంతో పాటు పీ4 కార్యక్రమం ద్వారా అట్టడుగున 20 స్థాయి మందికి చేయూత అందించేలా చర్యలు చేపట్టాం. బంగారు కుటుంబాలను ఎంపిక చేసి వారి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు తీసుకున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### పర్యాటక ల్యాండ్ మార్క్‌గా సూర్యలంక

"వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. అభివృద్ధితో పాటు పర్యావరణాన్ని కూడా మనం కాపాడుకోవాల్సి ఉంది. అన్ని ప్రాంతాల్లోనూ మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి. రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా మారుస్తున్నాం. రూ.1 లక్ష కోట్లతో ప్రకాశం జిల్లాతో కలిపి 10 జిల్లాలను గ్లోబల్ హార్టీ కల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తాం. ఉద్యాన పంటలతో పాటు లాజిస్టిక్స్ , పర్యాటకం ఇలా అన్ని రంగాల్లో పెట్టుబడులు వస్తాయి.బాపట్లలోని సూర్యలంక బీచ్ దీనిని గోవా తరహాలో అభివృద్ధి చేస్తాం. పర్యాటకుల్ని ఆకర్షించేలా దీనిని తీర్చిదిద్దాలని ప్రణాళికలు చేస్తున్నాం. ఆ పర్యాటకుల్ని ఆకర్షించటం ద్వారా సూర్యలంక దేశ చిత్రపటంలో ఓ ల్యాండ్ మార్క్ గా మారాలి. వాన్ పిక్ ప్రాంతాన్ని గొడ్డలి పార్టీ అధినేత సర్వనాశనం చేశారు. అభివృద్ధే రాకుండా పోయింది. ఇష్టానుసారం అవినీతి చేసి సీబీఐ, ఈడీ కేసుల్లో ఇరుక్కున్నాడు. వాన్ పిక్ ద్వారా అద్భుతమైన పారిశ్రామిక టౌన్ షిప్ తయారు కావాల్సిన ప్రాంతాన్ని నాశనం చేశారు. ప్రజలకు జవాబుదారీ పరిపాలన ఇవ్వాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ ఉద్యోగులకు నైపుణ్యాలు కల్పించి మెరుగైన పౌరసేవలు అందించేలా చర్యలు చేపడుతున్నాం. ఐగాట్- మిషన్ కర్మయోగి కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఈ నైపుణ్యాలను పెంచుతోంది. మన ఉద్యోగులు 2.2 కోట్ల కోర్సులు చేసి దేశంలోనే ఏపిని అగ్రస్థానంలో నిలిపారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు 4 వేల పైచిలుకు కోర్సులు చేసి నైపుణ్యాలు సాధించింది. ఇప్పుడు తన విద్యార్థులకు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యను అందించేందుకు ఆ నైపుణ్యాలు ఆమెకు ఉపయోగ పడుతున్నాయి. వ్యక్తిగతంగా మనం కూడా మనమన రోజువారీ కార్యక్రమాలను మరింత మెరుగ్గా నిర్వహించుకోవాలంటే నైపుణ్యాలు పెంచుకోవాలి. సామాజిక మాధ్యమాల్లో రీల్స్ చూడటం కాకుండా నైపుణ్యాలు పెంచుకునే అంశంపై సమయం కేటాయించాలని కోరుతున్నాను." అని సీఎం సూచించారు.

### అభివృద్ధి అంశంలో రాజీలేదు

"గత పాలకులు పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వేరాళ్లపై బొమ్మలు వేసుకోడానికి రూ.800 కోట్లు ఖర్చు పెట్టారు. రీసర్వే 2.0 ద్వారా భూవివాదాలు పరిష్కరించి రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నాం. శెట్టిపల్లి, కంగుమంది, అమలాపురం తదితర ప్రాంతాల్లో దశాబ్దాలుగా ఉన్న భూసమస్యల్ని పరిష్కరించాం. బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ద్వారా రెవెన్యూ రికార్డులను భద్రంగా పెడుతున్నాం. ఇప్పటికే 5.5 లక్షల ఇళ్లను పూర్తి చేసి పేదలకు అందించాం. మరో 5.5 లక్షల ఇళ్లను త్వరలోనే నిర్మించి ఇస్తాం. పౌర సేవల్ని ప్రజలకు దగ్గర చేసేలా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా సేవలు అందిస్త?న్నాం. డీప్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక రోజులు, నెలలు పట్టాల్సిన పనులు ఇప్పుడు నిముషాల్లోనే పూర్తి అవుతోంది. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ వివిధ రంగాల్లో అభివృద్ధి సాధిస్తోంది. రాష్ట్రంగా మనం అవకాశాలను అందిపుచ్చుకోవాలి. విశాఖకు డేటా సెంటర్లు తీసుకువస్తే గొడ్డలి పార్టీ నీటి సమస్య అంటూ అడ్డుపడుతోంది. అమరావతి అంటే ఎడారి అని, శ్మశానమని, మావిగన్ అంటున్నారు. అడ్డంకులకు ఆగిపోను, అభివృద్ధి విషయంలో రాజీ పడను. నాయకుడంటే ప్రజల రేపటి భవిష్యత్ గురించి ఆలోచన చేయాలి. అందుకే 2047 స్వర్ణాంధ్ర లక్ష్యంతో పనిచేస్తున్నాను. సమాజంలో చిట్టచివరి వ్యక్తి జీవన ప్రమాణాలు పెంచేలా చర్యలు చేపట్టాం. ఆదాయం, ఆరోగ్యం, ఆనందం అనే విధానంతో ముందుకు వెళ్తున్నాం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశానికి మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ కృష్ణప్రసాద్, నేతలు మోపిదేవి వెంకటరమణ తదితరులు హాజరయ్యారు.

## మా ఆస్తులు.. మీ ఆస్తులు.. విచారణకు సిద్ధమా? సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్!

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల వ్యవహారం మరోసారి వేడెక్కింది. సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. తమ కుటుంబ ఆస్తులతో పాటు రేవంత్‌రెడ్డి కుటుంబ ఆస్తులపైనా సుప్రీంకోర్టు లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విచారణలో తమ తప్పు తేలితే ఎలాంటి శిక్షకైనా సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. సిరిసిల్ల పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి తమ కుటుంబ ఆస్తులపై చేసిన ఆరోపణలకు కేటీఆర్ స్పందించారు. వ్యాపారం చేయడం తప్పా? అని ప్రశ్నించారు. తాను 2006లో హోటల్ వ్యాపారం ప్రారంభించానని చెప్పారు. ప్రస్తుతం మూడు హోటళ్లు ఉన్నాయని తెలిపారు. తన ఆస్తుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లలో వెల్లడించానని పేర్కొన్నారు. సిరిసిల్లలో చేనేత కార్మికుల సమస్యలను సీఎం పట్టించుకోలేదని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆత్మహత్య చేసుకున్న 35 మంది చేనేత కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తారని ఆశించామని చెప్పారు. అయితే సీఎం తన పర్యటనలో రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్నందుకే తమ కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రభుత్వం ఇలాంటి రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. ఇక హామీలు అమలు చేసే వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని చెప్పారు.

## లక్షలాది యువత ఆకాంక్షలకు ప్రతీక యూపీఎస్సీ

ఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వందేళ్ల ప్రస్థానం లక్షలాది మంది యువత ఆకాంక్షలకు, దేశ ప్రజల నమ్మకానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. గురువారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన యూపీఎస్సీ శతాబ్ది ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూపీఎస్సీ శతాబ్ది స్మారక నాణెం, పోస్టల్ స్టాంప్‌తో పాటు '100 ల్యాండ్‌మార్క్ జడ్జిమెంట్స్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నిన్న జరిగిన ఒక విమాన ప్రమాద ఘటనలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. "నిన్న జరిగిన ఘటనలో భారత పైలట్ కెప్టెన్ స్మిత్ చూపిన ధైర్యం, సమయస్ఫూర్తి, నిబద్ధత ప్రశంసనీయం. ఇజ్రాయెల్ ప్రధాని చెప్పినట్లుగా, 9/11 తరహా ఘోర విషాదాన్ని ఒక భారతీయుడు అడ్డుకున్నాడు" అని మోదీ అన్నారు. స్మిత్ ఘనత మనందరికీ గర్వకారణమని, తాను ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడానని తెలిపారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న స్మిత్ సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని దేశ ప్రజలందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. యూపీఎస్సీ వందేళ్ల ప్రస్థానంపై మోదీ మాట్లాడుతూ.. "ఇది కేవలం ఒక సంస్థ వందేళ్లు పూర్తి చేసుకోవడం కాదు, ఇది లక్షలాది యువత ఆశయాల వేడుక. ప్రతి భారతీయుడు ఈ సంస్థపై ఉంచిన అచంచల విశ్వాసానికి ఇది నిలువుటద్దం. ఈ సంస్థను ఉన్నత శిఖరాలకు చేర్చిన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు" అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సివిల్ సర్వీసుల చరిత్రను, మహనీయుల సేవలను మోదీ గుర్తుచేసుకున్నారు. "1920లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఈ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. ఆనాడు బ్రిటిష్ పాలన ఉన్నప్పటికీ ఆయన సంస్కృతంలో పేపర్ రాశారని ఇక్కడి గ్యాలరీలో చూశాను. అదేవిధంగా, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశాన్ని నడపడంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు. స్వతంత్ర భారతానికి అవసరమైన 'ఉక్కు చట్రాన్ని' (స్టీల్ ఫ్రేమ్) సర్దార్ పటేల్ అందించారు. ఈ సంస్థను దేశానికి ఒక ప్రధాన స్తంభంగా తీర్చిదిద్దారు" అని మోదీ వివరించారు. 1926 అక్టోబర్ 1న పబ్లిక్ సర్వీస్ కమిషన్‌గా ప్రారంభమైన ఈ సంస్థ, శతాబ్ద కాలంలో ఎన్నో మార్పులకు లోనై స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా రూపుదిద్దుకుందని ప్రధాని గుర్తుచేశారు. గతేడాది అక్టోబర్ 1న ప్రారంభమైన శతాబ్ది ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయి. సెప్టెంబర్ 30, అక్టోబర్ 1 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో వివిధ రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల చైర్మన్లు, సభ్యులు, కేంద్ర ప్రభుత్వ సీనియర్ అధికారులు, విద్యావేత్తలు, యూపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించే జీవోల రద్దు

అమరావతి: ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించుతూ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 104, 1065లను రద్దు చేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఈ జీవోలు ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. ఆరు వారాల్లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారు, వార్డుల పునర్విభజన, ఎన్నికల వాయిదా తదితర అంశాలపై దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం వల్ల మొత్తం రిజర్వేషన్ల కోటా 50 శాతాన్ని దాటుతోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్లు వాదించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, రిజర్వేషన్లు 50 శాతం లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తూ సదరు జీవోలను కొట్టివేసింది. అదే సమయంలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం చేసింది. వార్డుల పునర్విభజన ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. 'సర్' ప్రక్రియ పూర్తయ్యాకే ఎన్నికలు జరపాలంటూ వైసీపీ దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు, బీసీ జనాభా గణన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను కూడా కోర్టు కొట్టివేసింది. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సైతం తోసిపుచ్చింది. మొత్తం మీద ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడానికి హైకోర్టు నిరాకరించింది. కేవలం రిజర్వేషన్ల శాతాన్ని మాత్రమే సమీక్షించాలని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో స్థానిక పోరుకు అడ్డంకులు తొలగిపోయాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో ఎలా ముందుకు వెళుతుంది? కోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి కొత్త ఫార్ములాను ఎలా రూపొందిస్తుంది? అనేది ఆసక్తికరంగా మారింది. కోర్టు ఆదేశాల మేరకు ఆరు వారాల్లో ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉండటంతో ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెరిగింది.

## బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకోబోదని స్పష్టం చేసిన కిషన్ రెడ్డి

హైదరాబాద్: ఖైరతాబాద్ లో బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ నాయకుడు జి. కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ పొత్తుపై జరుగుతున్న ఊహాగానాలకు ఆయన తెరదించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యామని, అయితే ఈసారి బీజేపీ విజయం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే ముందుకు వెళుతుందని స్పష్టం చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు బొగ్గు కేటాయింపులపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయితే, సింగరేణి బొగ్గును వినియోగించుకునేలా ఈ ప్లాంట్‌కు ఎందుకు రూపకల్పన చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వైఖరిని కిషన్ రెడ్డి తీవ్రంగా ఎండగట్టారు. రాహుల్ గాంధీ రాజ్యాంగబద్ధమైన సంస్థలపై, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌పై అనుచిత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో మార్పు అనేది ప్రజల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందే తప్ప, రాహుల్ గాంధీ వల్ల సాధ్యం కాదన్నారు. శివుడు, రాముడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని, వాటిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సహా ఇతర విపక్షాలు కేంద్ర ఎన్నికల సంఘంపై, బీజేపీపై అసత్య ఆరోపణలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతాల వారీగా ప్రజల మధ్య చిచ్చుపెడుతోందని, తొలగించిన ఓట్లను (మరణించిన వారు, అక్రమ చొరబాటుదారులు) తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుపు తథ్యమని, తమ పార్టీ ఓట్లను దొంగిలించదని, కేవలం ప్రజల హృదయాలను గెలుచుకుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## లోకేశ్‌పై రాజ్‌దీప్ సర్దేశాయ్ ప్రశంసలు.. ఇతర నేతలు ఆదర్శంగా తీసుకోవాలని సూచన

అమరావతి: సీనియర్ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్.. ఆంధ్రప్రదేశ్ మంత్రి, టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్‌పై ప్రశంసలు కురిపించారు. తాను చేసిన ఇంటర్వ్యూలో లోకేశ్ వ్యవహరించిన తీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కఠినమైన ప్రశ్నలకు కూడా ఎలాంటి స్క్రిప్ట్ లేకుండా సూటిగా, స్పష్టంగా సమాధానాలు ఇచ్చారని కొనియాడారు. కొచ్చిలో జరిగిన ఇండియా టుడే సౌత్ కాంక్లేవ్‌లో రాజ్‌దీప్ సర్దేశాయ్.. మంత్రి లోకేశ్‌ను ముఖాముఖి ఇంటర్వ్యూ చేశారు. ఈ సందర్భంగా ఏపీ అభివృద్ధి, జాతీయ రాజకీయాలు, ఇతర అంశాలపై పలు ప్రశ్నలు సంధించారు. ఇంటర్వ్యూ చివరలో రాజ్‌దీప్ మాట్లాడుతూ... మీరు అడగబోయే ప్రశ్నల జాబితా ముందే ఇవ్వండి అని అడగని నాయకులను ఇంటర్వ్యూ చేయడం ఎప్పుడూ సులభంగా ఉంటుందని అన్నారు. ఈ ఇంటర్వ్యూపై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా నిన్న స్పందించారు. ఈ చర్చలో దేశం గురించి, రాష్ట్రం గురించి, పాలన గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడినట్టు వెల్లడించారు. ఎలాంటి స్క్రిప్ట్ అవసరం లేకుండానే రాజ్‌దీప్ అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చానని తెలిపారు. అందుకు రాజ్ దీప్ నేడు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలపై గతంలో నాయకులందరూ ఇలాగే ఉండేవారని, కానీ ఇప్పుడు అది చాలా అరుదుగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఇతర నేతలు మిమ్మల్ని ఆదర్శంగా తీసుకుంటారని భావిస్తున్నాను అంటూ రాజ్‌దీప్ మంత్రి లోకేశ్ కు కితాబిచ్చారు.

## మమతా వర్గానికి సుప్రీంలో చుక్కెదురు... రూ.804 కోట్ల ఖాతాలపై పిటిషన్ కొట్టివేత

ఢిల్లీ: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ వర్గానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. స్తంభింపజేసిన నాలుగు బ్యాంకు ఖాతాలను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం తోసిపుచ్చింది. ఈ ఖాతాల్లో సుమారు రూ. 804 కోట్ల మేర నిధులు ఉన్నట్లు సమాచారం. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ పి.బి. వరాలేలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. కలకత్తా హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వులలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. పార్టీలో నెలకొన్న వర్గపోరు కారణంగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే పార్టీ గుర్తును స్తంభింపజేసిందని, ఈ నేపథ్యంలో సదరు నిధులు యాజమాన్య హక్కులపై స్పష్టత రావాల్సి ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఈ దశలో నిధుల వినియోగంపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేమని స్పష్టం చేస్తూ, కేసు విచారణను వేగవంతం చేయాలని కలకత్తా హైకోర్టును ఆదేశించింది. ఆర్థిక అవకతవకల ఆరోపణలు, పలు ఎఫ్ఐఆర్‌ల నమోదు నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ పోలీసులు ఈ నాలుగు ఖాతాలను స్తంభింపజేశారు. దీనిపై మమతా వర్గం కలకత్తా హైకోర్టును ఆశ్రయించగా, ఆగస్టు 27న వారికి ఎటువంటి మధ్యంతర ఊరట లభించలేదు. అయితే, రోజువారీ పార్టీ నిర్వహణ ఖర్చుల కోసం కోర్టు నియమించిన ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో ఇతర ఖాతాలను పరిమితంగా వినియోగించుకోవడానికి హైకోర్టు అనుమతినిచ్చింది. ఖాతాల స్తంభనతో పార్టీ కార్యకలాపాలు నిలిచిపోతున్నాయని మమతా వర్గం వాదించినప్పటికీ, సుప్రీంకోర్టు మాత్రం హైకోర్టు నిర్ణయాన్నే సమర్థించింది.

## దేవుళ్ల మధ్య చిచ్చు: రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పరమేశ్వరుడు పేదల దేవుడని, శ్రీరాముడు ధనికుల దేవుడని సీఎం చేసిన వ్యాఖ్యలు మతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించేలా ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ విమర్శలు చేశారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలతో ఏకంగా దేవుళ్లను కూడా రాజకీయాల్లోకి లాగారని కిషన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. శివుడు, రాముడి పేర్లతో చేసిన ఈ వ్యాఖ్యలు యావత్ హిందూ సమాజాన్ని అవమానించేలా ఉన్నాయని, హిందువుల మధ్య అనవసర గొడవలు పెట్టే ప్రయత్నమని అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పక్కనపెట్టి, ఇలాంటి కొత్త వివాదాలను ముందుకు తెస్తోందని ఆరోపించారు. ప్రజలను విభజించడం కాంగ్రెస్ పార్టీకి ఎప్పటినుంచో ఉన్న అలవాటు అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి ఒక సవాల్ విసిరారు. "హిందూ దేవుళ్లపై మాట్లాడిన విధంగా ఇతర మతాల దేవుళ్ల గురించి మాట్లాడే ధైర్యం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉందా?" అని ఆయన ప్రశ్నించారు.

## ప్రభుత్వ బడుల అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అవసరం

**చిన్న చిన్న మౌలిక వసతుల కల్పనకు సహకరించాలి: యాగంటి మల్లిఖార్జునరావు**



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 01 ; నేటి శుభోదయ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లిఖార్జునరావు కోరారు. పాఠశాలల్లో చిన్నాచిన్న మౌలిక అవసరాల కల్పనకు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. మాచర్ల పట్టణంలోని నెహ్రూనగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం యాగంటి మల్లిఖార్జునరావు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకును పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంతకంతో ప్రభుత్వం తరఫున అందించిన ప్రశంసాపత్రాన్ని పాఠశాల హెచ్‌ఎం కేశవరెడ్డి, ఉపాధ్యాయులు ఏడుకొండలు, విద్యార్థుల తల్లిదండ్రులు కలిసి యాగంటికి అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం యాగంటి మాట్లాడుతూ.. సమాజంలో పేదరిక నిర్మూలన, అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించేలా ప్రభుత్వాలు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, షూ, సాక్సులతో పాటు మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. ఉపాధ్యాయులు విద్యాబోధనపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, విద్యా విధానాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరుగుతోందని యాగంటి తెలిపారు. గతంతో పోలిస్తే సుమారు 1.10 లక్షల మంది విద్యార్థులు అదనంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరినట్లు పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. పాఠశాలల్లో చిన్నాచిన్న మౌలిక అవసరాల కోసం ప్రతిసారీ ప్రభుత్వంపైనే ఆధారపడకుండా, అందుబాటులో ఉన్న మేరకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయవచ్చని యాగంటి మల్లిఖార్జునరావు పేర్కొన్నారు.

## శ్రీవారిని కాలినడకన వెళ్లి దర్శనం చేసుకున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు



తిరుపతి, నంద్యాల, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి ఆమె భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి లు గురువారం తెల్లవారుజామున శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. బుధవారం సాయంత్రం ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి దంపతులు తిరుపతి చేరుకొని అలిపిరి మెట్ల మార్గం ద్వారా కాలినడకన తిరుమల చేరుకొని గురువారం తెల్లవారుజామున శ్రీవారికి ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి భర్త డాక్టర్ శివచరణ్ రెడ్డి తలనీలాలు సమర్పించుకొని శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శనం చేసుకొని, శ్రీవారి ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

## "డైమండ్స్ లయన్స్ నేత్ర వైద్యపరీక్షలు శిబిరం నిర్వహించిన లయన్ పేరిచర్ల "




తాడేపల్లిగూడెం అక్టోబర్ 1 (నేటి-శుభోదయ) సర్వేంద్రియాణాం నయనం ప్రధానం అంటారు. అంటే మన శరీరంలోని అన్ని అవయవాలలో కంటే కళ్ళు చాలా ముఖ్యమైనవి. అటువంటి అమూల్యమైన కంటి చూపును రక్షించుకోవడం మన అందరి బాధ్యత అని రీజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు అన్నారు.

స్థానిక మోడ్రన్ శ్రీ ప్రగతి జూనియర్ కాలేజ్ ఆవరణలో క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ లయన్ కొప్పిశెట్టి రమణయ్య (చంటి) సహకారం తో తాడేపల్లిగూడెం గూడెం డైమండ్స్. వనిత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్ ఐ క్లినిక్ వారి ఉచిత నేత్ర శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు, పేరెంట్స్ కు నేత్ర పరీక్షలు జరిపి ఉచిత డ్రాప్స్ అందించారు. ఆర్ సి లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో మారుతున్న జీవనశైలి, మొబైల్.కంప్యూటర్ల వాడకం మరియు సరైన పోషకాహారం లోపించడం వల్ల చాలా మంది చిన్న వయసులోనే కంటి సమస్యల బారిన పడుతున్నారు.

అలాగే వృద్ధాప్యంలో వచ్చే శుక్లాలు (కేటరాక్ట్స్ ) మరియు ఇతర సమస్యల వల్ల ఎంతో మంది చూపును కోల్పో కోల్పోతున్నారని అన్నారు.

చాలా మంది గ్రామీణ ప్రాంతాల ప్రజలు అవగాహన లేకపోవడం వల్ల లేదా ఆర్థిక ఇబ్బందుల వల్ల సకాలంలో కంటి పరీక్షలు చేయించుకో చేయించుకోలేక పోతున్నారనిర దీనిని దృష్టిలో ఉంచుకుని,మన ప్రాంత ప్రజల కోసం విద్యార్థుల కోసశీ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని (ఐ క్యాంప్) ను లయన్ కొప్పిశెట్టి రమణయ్య శ్రీ ప్రగతి జూనియర్ కాలేజ్ లో ఏర్పాటు చేయడం స్ఫూర్తి దాయకమన్నారు. క్లబ్ అధ్యక్షులు చెన్నా రెడ్డి సతీష్ మానేపల్లి కిరణ్ కుమార్, లయన్ కొల్లి రమావతిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వనిత లయన్స్ క్లబ్ సభ్యులు లయన్ లక్ష్మి లలిత, రమా కుమారి, ధనలక్ష్మి,యర్రా ఆంజనేయ స్వామి, ప్రగతి కాలేజ్ ప్రిన్సిపాల్ యు.సుందర్ గోపాల్, బోధనా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి కేరాఫ్ పుట్టపర్తి నియోజవర్గం

చరిత్రలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజవర్గం లో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో రూ.69 వేల కోట్ల తో అభివృద్ధి పనులు

ఈ రెండేళ్లలో 193 చెరువులు, 2 రిజర్వాయర్లు కృష్ణా జలాలతో నింపుతాం.

పుట్టపర్తిలో 1లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు రిలయన్స్ సహకారంతో దేశంలోనే మన ఆమడగూరు మండలంలో రూ.51 వేల కోట్లతో అతి పెద్ద సోలార్ ప్రాజెక్టు

అడుగడుగునా ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కి ఘన స్వాగతం

పల్లె పల్లెనా హారతులు ఇచ్చి పూల వర్షం కురిపించిన ప్రజలు

పసుపు మయంగా మారిన నల్లమాడ మండలం

రూ.21.17 లక్షలు వ్యయంతో 37 పనులకు ప్రారంభించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



అనంత పురం బ్యూరో అక్టోబర్ 01 నేటి శుభోదయ: పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో చరిత్రలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా భారీ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. నల్లమాడ మండలంలో గురువారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా అడుగడుగునా ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు ఇచ్చి, పూల వర్షం కురిపించడంతో నల్లమాడ మండలం పసుపుమయంగా మారింది. నల్లమాడ రైతు భరోసా కేంద్రంలో కస్టమ్ హైరింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వ్యవసాయ ఖర్చులను తగ్గించి, రైతులకు మరింత ప్రయోజనం కల్పించడమే కస్టమ్ హైరింగ్ సెంటర్ల లక్ష్యమని వారు తెలిపారు. అనంతరం నల్లమాడ పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అర్హులైన పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితరులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. రూ.21.17 లక్షలతో 37 అభివృద్ధి పనులకు శ్రీకారం నల్లమాడ మండలంలో సుమారు రూ.21.17 లక్షల వ్యయంతో చేపట్టిన 37 అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పుట్టపర్తి అభివృద్ధికి భారీ ప్రణాళికలు పుట్టపర్తి నియోజకవర్గంలో రానున్న కాలంలో భారీ స్థాయిలో అభివృద్ధి, పారిశ్రామిక ప్రాజెక్టులు రానున్నాయని వారు తెలిపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో రెండేళ్లలో నియోజకవర్గంలో సుమారు రూ.69 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. కృష్ణా జలాలను పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లకు అందించి సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.1 లక్ష కోట్లతో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు, ఆమడగూరు మండలంలో రిలయన్స్ సహకారంతో సుమారు రూ.51 వేల కోట్లతో భారీ సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రాంతానికి భారీ పెట్టుబడులు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పెడపల్లి ప్రాంతంలో మహా జీన్స్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి 4వేలమంది మహిళలకు ఉపాధి కల్పిస్తామని పేర్కొన్నారు. పుట్టపర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ ప్రజా ప్రతినిధులు , కూటమి పార్టీల టీడీపీ ,బిజెపి ,జనసేన నాయకులు, కూటమి శ్రేణులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# తాళ్లూరులో పేదల సేవలో 2.0 గ్రామసభ ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ



కాకినాడ జిల్లా, జగ్గంపేట అక్టోబర్ 1 నేటి శుభోదయ : గండేపల్లి మండలం తాళ్లూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన పేదల సేవలో 2.0 కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట శాసనసభ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, తెలుగుదేశం పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు జ్యోతుల నెహ్రూ తాళ్లూరు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు లబ్ధిదారులకు స్వయంగా అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సంక్షేమ పాలనకు పెద్దపీట వేస్తున్నాం. గత ప్రభుత్వం మూడు వేల రూపాయలు కూడా సరిగా ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక వృద్ధులకు మూడు వేల నుండి నాలుగు వేలకు, విభిన్న ప్రతిభావంతులకు మూడు వేల నుండి ఆరు వేలకు, మంచానికే పరిమితమైన వారికి పది వేల నుండి పదిహేను వేలకు పెంచి పేదలకు నిజమైన భరోసా ఇచ్చింది. జగ్గంపేట నియోజకవర్గంలో 42 వేల పై గా ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ అందజేస్తున్నామని మళ్లీ కొత్త పెన్షన్లు కూడా చాలామంది అప్లికేషన్ పెట్టుకున్నారని ఒక తాళ్లూరు గ్రామంలోనే 620 మందికి 25,91000 రూపాయల ఆర్థిక సహాయం ప్రతి నెల అందుతుందని అన్నారు. పేదల సేవలో 2.0 గ్రామసభ అనేది ఒక కార్యక్రమం కాదు, ప్రజలతో ప్రత్యక్ష అనుసంధానం. అక్టోబర్ ఒకటి 2026 నుండి డిసెంబర్ 31 2027 వరకు 15 నెలల పాటు రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో, ప్రతి సచివాలయ క్లస్టర్ లో ఈ కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో నాలుగు ప్రధాన అంశాలు ఉంటాయి. సంక్షేమ పథకాలపై అవగాహన, అర్హుల గుర్తింపు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా 15 రోజుల్లో సమస్యల పరిష్కారం, పి నాలుగు మార్గదర్శి అనుసంధానం ద్వారా బంగారు కుటుంబాలకు అండ. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ముఖ్యంగా డ్వాక్రా మహిళలు, స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు ప్రత్యేకంగా స్టాళ్లు ఏర్పాటు చేశారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి బ్యాంకు రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని శాసనసభ్యులు హామీ ఇచ్చారు. అదే విధంగా వచ్చిన ప్రజలకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, చక్కెర వ్యాధి పరీక్షలతో పాటు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. జగ్గంపేట నియోజకవర్గంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి, సంక్షేమంతో ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అని ఎమ్మెల్యే నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, రాష్ట్ర డైరెక్టర్లు పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, ఎస్ వి ఎస్ అప్పలరాజు, జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు కందుల చిట్టిబాబు, క్లస్టర్ ఇంచార్జి జాస్తి వసంత్, అన్నవరం బోర్డు సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, గ్రామ నాయకులు పి వెంకటేశ్వరరావు, పాలచర్ల సత్యనారాయణ, ఎస్ వీరబాబు, కోండ్రు అప్పలరాజు, సొసైటీ డైరెక్టర్ వీరబాబు, అమ్మన్న చౌదరి, వాసు, విద్యా కమిటీ చైర్మన్ జే సత్తిబాబు, ఎమ్మార్వో పద్మజ , ఎంపీడీవో హరికృష్ణ సత్య రెడ్డి , స్వర్ణాంధ్ర విజన్ 2047 సిబ్బంది గ్రామ



# సంక్షేమానికి చిరునామా కూటమి ప్రభుత్వం

**- సింగరంపాలెంలో పింఛన్లు పంపిణీ చేసిన కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహన్ రావు**



కాకినాడ జిల్లా జగ్గంపేట అక్టోబర్ 1 నేటి శుభోదయ: గండేపల్లి మండలం సింగరంపాలెం గ్రామంలో నవంబర్ 1న ఎన్టీఆర్ సామాజిక భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్ రావు లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రెండు సంవత్సరాల కూటమి పరిపాలన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నియోజకవర్గానికి 589 కోట్ల రూపాయలతో ప్రత్యేక సంచికలను ప్రజలకు అందజేసి కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడాలని కోరారు.

**ఈ సందర్భంగా**

**పోతుల మోహన్ రావు మాట్లాడుతూ:**

- కూటమి ప్రభుత్వం అంటేనే సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనం. పేదల కష్టాలు తెలిసిన ప్రభుత్వం ఇది.

- ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టితో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయి.

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ నాయకత్వంలో నియోజకవర్గంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.

- గత ప్రభుత్వం 3000 రూపాయలు కూడా సరిగా ఇవ్వలేకపోతే, కూటమి ప్రభుత్వం వచ్చాక వృద్ధులకు 3000 నుండి 4000, విభిన్న ప్రతిభావంతులకు 3000 నుండి 6000, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి 10000 నుండి 15000 రూపాయలకు పెంచి చరిత్ర సృష్టించింది.

- 1వ తేదీ తెల్లవారుజామునే వాలంటీర్ వ్యవస్థ లేకుండా నేరుగా ఇంటికి వచ్చి గౌరవంగా పింఛన్ ఇవ్వడం, వారి బాగోగులు తెలుసుకోవడం కూటమి ప్రభుత్వానికే సాధ్యం.

- పెన్షన్లే కాదు, రోడ్లు, తాగునీరు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో గండేపల్లి మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతాం.

ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పీవీకేకే పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే -- 2026

అనంత పురం బ్యూరో అక్టోబర్ 01 నేటి శుభోదయ: అనంతపురం రుద్రంపేటలోని పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ "ఫ్రెషర్స్ డే -- 2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.వి.ఆర్. జ్యోతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. సాంకేతిక విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిషోర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధునిక వసతులు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విద్యాసంస్థల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.యస్.యన్. వైభవ్ మాట్లాడుతూ, విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని సాంకేతిక నైపుణ్యాలతో పాటు మానవీయ విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధికి యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత కార్యక్రమాలు తదితర ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలకడంతో కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కళాశాల స్పెషల్ ఆఫీసర్ టి. శ్రీనివాసులు రెడ్డి, యాజమాన్య ప్రతినిధి కె. శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌బీఎల్‌జే కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పీవీకేకే పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే - 2026




అనంత పురం బ్యూరో అక్టోబర్ 01 నేటి శుభోదయ: అనంతపురం రుద్రంపేటలోని పీవీకేకే ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పాలిటెక్నిక్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ "ఫ్రెషర్స్ డే -- 2026" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురము వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, విద్యార్థి దశలోనే స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని సాధించేందుకు క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. సాంకేతిక విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సమయపాలన వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం అభివృద్ధి చేసుకుంటూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. శ్రీ బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డా. పల్లె వెంకట కృష్ణ కిశోర్ మాట్లాడుతూ, విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, సాఫ్ట్ స్కిల్స్, సృజనాత్మకత, క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంచుకొని దానికి అనుగుణంగా భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలని తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ఆధునిక వసతులు, శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను విద్యాసంస్థల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.యస్.యన్. వైభవ్ మాట్లాడుతూ, విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని సాంకేతిక నైపుణ్యాలతో పాటు మానవీయ విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థుల అభివృద్ధికి యాజమాన్యం ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సంగీత కార్యక్రమాలు తదితర ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆత్మీయ స్వాగతం పలకడంతో కళాశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కళాశాల స్పెషల్ ఆఫీసర్ టి. శ్రీనివాసులు రెడ్డి, యాజమాన్య ప్రతినిధి కె. శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌బీఎల్‌జే కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బారావు, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## పింఛన్లు పంపిణీ చేసిన లింగాయత్ రాష్ట్ర చైర్ పర్సన్ తుల్జాపూర్ స్వప్న



అనంత పురం అక్టోబర్ 01 నేటి శుభోదయ: ప్రతినెల 1 తారీఖున వృద్ధులకు వితంతులకు వికలాంగులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతోంది. అందులో భాగంగా గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమం 55వ డివిజన్ నందు అర్హులున్న ప్రతి ఒక్కరి ఇంటి వద్దకు వెళ్లి సచివాలయ సిబ్బందితో కలిసి పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వీరశైవ లింగాయత్/లింగ బలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్, తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుల్జాపూర్ స్వప్న ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 3000 పెన్షన్ పెంచడానికి ఐదు సంవత్సరాలు కాలం పట్టిందని తెలుగుదేశ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒకేసారి 4000 వేల రూపాయలు అందజేశామని స్పష్టం చేశారు. వృద్ధులకు 4000 వేలు వికలాంగులకు 6000 వేలు పూర్తి అంగవైకల్యం కలిగిన వారికి 10 వేలు 15వేలు ఇస్తున్నామని స్పష్టం చేశారు.

## అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం..

**-వయోవృద్ధులకు పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ..**




అనంతపురం బ్యూరో అక్టోబర్ 01 నేటి శుభోదయ : -అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం అనంతపురం నగరంలోని రాజు రోడ్డులోని వైశ్య హాస్టల్ కాంపౌండ్‌లో ఉన్న శ్రీ వాసవీ వృద్ధాశ్రమాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వయోవృద్ధులను కలిశారు. వారితో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు పింఛన్లను ఎంపీ పంపిణీ చేశారు. దాతల సహకారంతో వృద్ధాశ్రమంలోని పెద్దలకు అవసరమైన బెడ్‌షీట్లు, వస్త్రాలు తదితర సామగ్రిని అందజేశారు. వయోవృద్ధులకు అవసరమైన వైద్య సహాయం, ఇతర సేవలు అందిస్తూ వాసవీ వృద్ధాశ్రమం పాలకవర్గం చేస్తున్న సేవలు అభినందనీయం అని ఎంపీ పేర్కొన్నారు. మన పెద్దల అనుభవం, ఆశీస్సులు సమాజానికి ఎంతో విలువైనవి. వయోవృద్ధులకు గౌరవం, ఆప్యాయత, భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం అధ్యక్షులు తలుపుల కృష్ణమూర్తి, ట్రెజరర్ గోపనపల్లి కృష్ణయ్య, జర్నలిస్ట్ ఇటికాల శివ రామాంజనేయులు, అనంతపురం కొత్తూరు ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి అనంతపురం జిల్లా ఏవిఓపిఎ కమిటీ సెక్రటరీ జయంతి సత్యారామ్ ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.




## అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహణ




అనంత పురం అక్టోబర్ 01 నేటి శుభోదయ: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ సంవత్సరపు థీమ్ గౌరవప్రదమైన వృద్ధాప్యం - వృద్ధుల సంరక్షణ సహాయ వ్యవస్థలను బలోపేతం చేద్దాం"లి అని, అక్టోబర్ నెల మొత్తం జిల్లాలోని అన్ని పి హెచ్ సి, సి హెచ్ సి లలో వృద్ధులకు ప్రత్యేక వైద్య శిబిరాలు, ఎన్ సి డి స్క్రీనింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

వృద్ధులందరూ ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అసంక్రమిత వ్యాధుల నోడల్ ఆఫీసర్ డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ, వృద్ధులలో బి పి షుగర్ గుండె జబ్బులను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించడం వలన ఆరోగ్యకరమైన వృద్ధాప్యం సాధ్యమవుతుందని, మానసిక సమస్యలకు టెలి మానస్14416 కి కాల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసినటువంటి, ప్రోగ్రాం ఆఫీసర్స్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రసన్న భారతి, సూపర్ టెంట్ ఏ ఓ మనోజ్ కుమార్ ఎన్ హెచ్ ఎం కిషోర్, ఫణి, ఎన్ సి డి ఫ్లోరోసిస్ ఆంజనేయులు, జిల్లా పొగాకు నియంత్రణ సామాజిక కార్యకర్త శ్రీరాములు,ప్రేమ్ మౌనిక, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## "వరసిద్ధి వినాయక ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ ఉండాలి వైసీపీ ఇన్చార్జి వడ్డీ రఘురాం నాయుడు"



తాడేపల్లిగూడెం అక్టోబర్ 1 (నేటి- శుభోదయ) తాడేపల్లిగూడెం నియోజకవర్గం ప్రజలందరికీ వరసిద్ధి వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ వడ్డీ రఘురాం నాయుడు అన్నారు. గురువారం పెంటపాడు మండలం ప్రత్తిపాడు ట్రిబుల్ఎఫ్ నందు శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాలు సందర్భంగా అఖండ అన్న సమారాధన కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరసిద్ధి వినాయక ఆశీస్సులు నిండుగా, మెండుగా ప్రతి ఒక్క కుటుంబానికి ఉండాలని ఆ వరసిద్ధి వినాయకుని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అయ్యిందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం పెంటపాడు మండలం కస్పా పెంటపాడు లో శ్రీ వేణుగోపాల స్వామి మరియు శ్రీ ఆంజనేయ స్వామి వార్ల ఆలయంలో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికి పాల్గొన్నారు. ఆలయ ఫిట్ పర్సన్ చంద్రశేఖర్ ఆహ్వానం పలుకుతూ స్వాగతించారు. వేణుగోపాల స్వామి మరియు ఆంజనేయస్వామి ఆశీస్సులు నియోజవర్గ ప్రజలందరికి ఉండాలని అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పట్టణంలోని 15 వ వార్డు సవిత్రిపేట లో గూడ బాబి అండ్ శశి వారి మిత్రమండలి ఏర్పాటు చేసిన శ్రీ శ్రీ శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాల సందర్భంగా అఖండ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని వినాయక ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని ఆ వినాయకుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు గొర్రెల శ్రీనివాస్, జిల్లా యూత్ వింగ్ విభాగం అధ్యక్షులు వీర్ల వెంకటేష్, పాలూరి దొరబాబు, పెంటపాడు మండల వైసీపీ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్, ద్వారంపూడి కిరణ్ కుమార్ రెడ్డి, నల్లిమిల్లి విజయానంద రెడ్డి, కునుకు పుల్లయ్య, కే. పెంటపాడు వేణుగోపాలస్వామి ఆలయ పిట్ పర్సన్ వి. చంద్రశేఖర్ ఆయా గ్రామాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా.. 15వ వార్డులో పింఛన్ల సందడి



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 01; నేటి శుభోదయ : పట్టణంలోని 15వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సందడిగా జరిగింది. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, మాచర్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు వార్డులోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా యాగంటి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పెద్దల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గౌరవప్రదంగా అందిస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ మొత్తాన్ని రూ.4 వేలకు పెంచి లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేస్తున్నామని పేర్కొన్నారు. పింఛన్ పంపిణీ అనంతరం వార్డులోని ప్రజలతో యాగంటి మల్లికార్జునరావు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, వాటిని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. పింఛన్లు అందుకున్న అవ్వాతాతలు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 15వ వార్డు కూటమి నాయకులు, బూత్ ఇన్‌చార్జులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి బిన్ అండ్ బ్యాగ్ విధానంలో చెత్త సేకరణ పై ఇంటింటికి అవగాహన కల్పిస్తున్నాం

**డిప్యూటీ ఎంపిడిఓ వంగా శ్రీనివాస్**




పెదపారుపూడి, అక్టోబర్ 1 నేటి శుభోదయ : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ గ్రామ పంచాయతీలలో అమలుచేస్తున్న నూతన పారిశుధ్య విధానం లో భాగంగా మండలంలోని ప్రతి ఇంటికి బిన్ అండ్ బ్యాగ్ విధానం లో చెత్త సేకరణ గురించి ఇంటింటికీ అవగాహన కలిగిస్తున్నట్లు పెదపారుపూడి డిప్యూటీ ఎంపీడీఓ వంగా శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమం లో భాగంగా గురువారం పెదపారుపూడిలో పిడిఓ మరియు పంచాయతీ సిబ్బంది తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీఓ మాట్లాడుతూ తడి చెత్తను ప్రతి రోజూ పంచాయతీ చెత్త బండికి బిన్ ద్వారా అందించాలని అలాగే పొడి చెత్త ను ఒక సంచిలో దాచి ఉంచి పక్షం రోజులకొకసారి గ్రామాన్ని సందర్శించే స్వచ్ఛ రథం కి అందించాలాన్నారు. అందించిన చెత్త విలువ మేరకు నిత్యావసర వస్తువులు పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ అభివృద్ధి అధికారి కృష్ణ వేణి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదలకు అండగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్

**రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్**



పెనమలూరు, అక్టోబర్ 1 నేటి శుభోదయ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ కార్యక్రమం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ అన్నారు. గురువారం యనమలకుదురు గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలు మరియు బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. రాష్ట్ర మంత్రివర్యులు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ సారధ్యంలో పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేస్తున్నామని శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడం వల్ల వారి రోజువారీ అవసరాలను తీర్చుకోవడానికి ఎంతో తోడ్పాటు లభిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి, అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నేడు గాంధీ జయంతి సందర్భంగా కబేళా, చేపల మార్కెట్లు, మాంసపు దుకాణాలకు సెలవు వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయ):-నేడు గాంధీ జయంతి సందర్భంగా సందర్భంగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఉత్తర్వుల మేరకు నగరంలో ఉన్న కబేళాకు సెలవు ప్రకటించారు. నగరంలో ఉన్న అన్ని చికెన్ షాపులు, మటన్ షాపులు, చేపల మార్కెట్లు తెరవటానికి అనుమతి లేదు. ఎవరైనా అనుమతి లేకుండా జీవాలను వధించిన యెడల, లేదా షాపులను తెరిచి మటన్, చికెన్ , చేపలను అమ్మితే చట్ట ప్రకారం వారిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ ఆదేశించారు. కావున మటన్, చికెన్, చేపలు హోల్ సేల్, రిటైల్ వ్యాపారస్తులు అన్ని షాపులు మూసి వేయాలని ఆదేశించడమైనది.

శిథిలావస్థకు చేరిన విఎంసి దుకాణాల తొలగింపు

విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం అజిత్ సింగ్ నగర్ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌లో శిథిలావస్థకు చేరిన ఖాళీ దుకాణాల తొలగింపు (డెమాలిషన్) కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న దుకాణాల నిర్మాణాలను తొలగించారు. ఎస్టేట్, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులు, ఎన్‌క్రోచ్‌మెంట్ సిబ్బంది సమన్వయంతో ఈ చర్యలు చేపట్టారు. తొలగింపు ప్రక్రియలో తలెత్తే టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు. నగరంలో శిథిలావస్థలో ఉన్న, ప్రజలకు ప్రమాదకరంగా మారే నిర్మాణాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఎస్టేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన విఎంసి దుకాణాల తొలగింపు




విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయ):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం ఉదయం అజిత్ సింగ్ నగర్ స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్‌లో శిథిలావస్థకు చేరిన ఖాళీ దుకాణాల తొలగింపు (డెమాలిషన్) కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ అధికారులు చేపట్టారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరంగా ఉన్న దుకాణాల నిర్మాణాలను తొలగించారు. ఎస్టేట్, టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన అధికారులు, ఎన్‌క్రోచ్‌మెంట్ సిబ్బంది సమన్వయంతో ఈ చర్యలు చేపట్టారు. తొలగింపు ప్రక్రియలో తలెత్తే టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన అంశాలను అధికారులు పరిశీలించారు. నగరంలో శిథిలావస్థలో ఉన్న, ప్రజలకు ప్రమాదకరంగా మారే నిర్మాణాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర హెచ్.ఎం. అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, ఎస్టేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం, ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ సెంట్రల్ లోని 63వ డివిజన్ రాజీవ్ నగర్ సెంటర్, 62వ డివిజన్ నాదీమ నగర్ వికలాంగుల హాస్టల్‌లో "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వృద్ధాప్య, వితంతు, వికలాంగులు, ఇతర సామాజిక భద్రతా పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో పేదలు, బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గతంలో రూ.2,000గా ఉన్న పింఛన్‌ను రూ.3,000కు పెంచారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు రూ.3,000 పింఛన్‌ను రూ.4,000కు పెంచి వృద్ధులకు అండగా నిలిచిందన్నారు. అదేవిధంగా వికలాంగుల పింఛన్‌ను రూ.3,000 నుంచి రూ.6,000కు పెంచామని తెలిపారు. మంచానికే పరిమితమైన వారికి రూ.10,000, తలసేమియా బాధితులకు రూ.16,000 పింఛన్ అందిస్తున్నామని చెప్పారు. పేదల సంక్షేమం కోసం దేశంలోనే ప్రత్యేకమైన పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాల ద్వారా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. పేదలకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాలను అందిస్తున్నామని, వారి ఆస్తులకు చట్టబద్ధమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. పేదల సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, మాజీ కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని ఉమా సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని అన్నారు. పేదల కోసం ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని బొండా ఉమా తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్లు తిరుపతమ్మ , పైడి తులసి, 63వ డివిజన్ అధ్యక్షుడు అబ్బ వైకుంఠం, సెక్రెటరీ కోలా శ్రీనివాసరావు, ఇన్చార్జ్ మోతూ్కరు కాసిం, మహిళా నాయకురాలు లబ్బ దుర్గ, పెద్ది శ్రీను, వసంత, 62వ డివిజన్ ఇంచార్జ్ పైడి శ్రీను, డివిజన్ సెక్రటరీ మరియా, బూత్ కన్వీనర్ మణి యాదవ్, మంగరాజు, సాయి, గోసులరవి, చెక్క సుబ్బారావు, జతధర్, రాంబాయమ్మ, లోకేశ్వరి,గొట్టంనగరాజు, చిన్నారావు, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా రాజీవ్ గాంధీ పార్కులో 'ఏక్ గంట ఏక్ సాథ్' కార్యక్రమం



విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయం):-విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం రాజీవ్ గాంధీ పార్కులో 'ఏక్ గంట ఏక్ సాథ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, నగరపాలక సంస్థ సిబ్బంది సమిష్టిగా పాల్గొని ఒక గంట పాటు పార్కు ప్రాంగణంలో విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. పార్కులోని పరిసరాలను శుభ్రపరచి, చెత్తాచెదారాన్ని తొలగించి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ప్రజల్లో స్వచ్ఛతపై అవగాహన పెంపొందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని ఈ కార్యక్రమం ద్వారా సందేశాన్ని అందించారు. పరిశుభ్రమైన నగర నిర్మాణంలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని నగరపాలక సంస్థ అధికారులు సూచించారు.

## సమస్యల త్వరితగతిన పరిష్కారానికై మండల న్యాయ సేవాధికార సంస్థలను సంప్రదించండి:

**ఎం. సునీల్ కుమార్ 2వ అదనపు జిల్లా జడ్జి**



విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయ):- విజయవాడ గవర్నర్ పేటలో ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా గురువారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును పారా లీగల్ లాయర్ పగిడిపల్లి రాము నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా 2వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ ఎం. సునీల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ వృద్ధులందరూ కుటుంబ పరంగా కాని ఆర్థిక పరంగా కాని న్యాయ పరంగా కాని ఏమైనా సమస్యలను ఎదుర్కొంటే నగరంలోని ఎ. ఎస్ రామారావు హాల్ లోని న్యాయ విజ్ఞాన సదస్సు కేంద్రాన్ని కాని లేదా అమ్మ ప్రేమ ఆధరణ సేవా సంస్థలో న్యాయ విజ్ఞాన సదస్సు కేంద్రాన్ని కాని నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న న్యాయ సేవాసదన్ సంస్థలలోని పారా లీగల్ లాయర్ లను సంప్రదించి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం ఎం. సునీల్ కుమార్ మొక్కలను నాటే కార్యక్రమంలో పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో దావులూరి సాంబశివరావు, నందిగం రఘునాథం, మోతుకూరి వెంకటేశ్వరరావు, అమ్మ ప్రేమ ఆధరణ సేవా సంస్థ నిర్వాహకురాలు కొవ్వాడ అన్నపూర్ణమ్మ, శ్రీమతి నేమాని కామేశ్వరి, నాదెళ్ల సుమతి, ముప్వ శైలజ, కడియాల శాంతి, చింతా రమాదేవి, జవ్వాజి శ్రీనివాసరావు, పడమటి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంవి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ సేవా సంకల్ప్ అభియాన్ వికసిత్ భారత్ - 2047





విస్సన్నపేట : నేటి శుభోదయ(ప్రతినిధి కమలాకర్)ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలోని స్థానిక పట్టణంలో గల సిధార్థ క్రియాటివ్ ఈ ఎం ఉన్నత పాఠశాల నందు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివి.మాధవ్ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ సూచనలతో ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు పోలే శాంతి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ టౌన్ అధ్యక్షులు వెంపాటి అబ్రహం మణిరత్నం చేపట్టిన సేవ సంకల్ప కార్యక్రమాలకు అనుగుణంగా ప్రధానమంత్రి మోడీ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా తిరువూరు పట్టణంలో గల సిధార్థ క్రియేటివ్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థిని విద్యార్థులకు వికసిత్ భారత్ యొక్క 2047 లక్ష్యాన్ని చేరుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమ ఇంచార్జ్ పొన్నూరు రామ్మోహనరావు మరియు యుపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీ నిర్వహించడం జరిగింది ఈ పోటీ నిర్వహణలో విద్యార్థినీ విద్యార్థులకు 6 రకాల బహుమతులు అందించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధ్యాయులు శేషు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల అనుభవాలను పంచుకోండి. సమాజంలో ముందుకు దూసుకుపోండి: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయ):- విజయవాడ గవర్నర్ పేటలోని స్వాతంత్ర్య సమర యోధుల ప్రాంగణంలో గురువారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును పారా లీగల్ లాయర్ పగిడిపల్లి రాము నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పాల్గొని మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఉన్న ఆధునిక టెక్నాలజీతో అన్ని రంగాల్లో ఎంతో ముందుకు దూసుకుపోతున్న మనందరం కూడా వయోవృద్ధులైన ముత్తాతలు, తాతలు, తల్లిదండ్రుల అనుభవం నుంచి మనం ఎంతో నేర్చుకోవాల్సింది ఉందని కాబట్టి ఉమ్మడి కుటుంబాల్లోనే జీవించాలని, వారి అనుభవాలను మనం ఆదర్శంగా తీసుకొని సమాజంలో ముందుకు దూసుకుపోవాలని పిలుపునిచ్చారు. వయోవృద్ధులందరూ వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. విజయవాడ డీసీపీ శ్రీమతి కె.జి.వి. సరిత మాట్లాడుతూ వృద్ధులను ఆదర్శంగా తీసుకొని, సమాజంలో ముందుకు దూసుకుపోతూ, మీ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం వయోవృద్ధులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దావులూరి సాంబశివరావు, నందిగం రఘునాథం, మోతుకూరి వెంకటేశ్వరరావు, అమ్మ ప్రేమ ఆధరణ సేవా సంస్థ నిర్వాహకురాలు కొవ్వాడ అన్నపూర్ణమ్మ, శ్రీమతి నేమాని కామేశ్వరి, నాదెళ్ల సుమతి, ముప్వ శైలజ, కడియాల శాంతి, చింతా రమాదేవి, జవ్వాజి శ్రీనివాసరావు, పడమటి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంవి బాబు, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారథ్యంలో పేదల సేవలో...ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



పెనమలూరు, అక్టోబర్ 1నేటి శుభోదయ: "పేదల సేవలో - ఎన్టీఆర్ భరోసా పెన్షన్" పంపిణీ కార్యక్రమం పెనమలూరు మండలం పెనమలూరు గంగూరు గోసాల వణుకూరు పెద్దపులిపాక చోడవరం నిర్వహించామని తెనుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. గురువారం పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ పిలుపుమేరకు పెనమలూరు మండలం గ్రామాల్లో పేదల సేవలో - ఎన్టీఆర్ భరోసా కార్యక్రమంలో పాల్గొని అవ్వాతాతలకు పింఛన్లు ఇవ్వడం కొత్త పెన్షన్ లో పెనమలూరు రూరల్ మండలంలో 4 స్పోవ్స్ పెన్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు . ఈ కార్యక్రమంలో మారుపూడి ధన కోటేశ్వరావు, కోయ ఆనంద ప్రసాద్, సంగేపు రంగారావు, ఇర్ఫాన్ పాషా, కలపాల శ్రీధరర్, దొండపాటి సురేష్, గూడవల్లి పూర్ణ, బడుగు సాంబశివరావు, ముసునూరు శ్రీనివాస్, మాబు సుభాని, ఎందువ రాంబాబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల ముఖాల్లో ఆనందమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

**: తూర్పులో ఘనంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేసిన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె**



విజయవాడ, అక్టోబర్ 1(నేటి శుభోదయ):-రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, భారతీయ జనతా పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. గురువారం ఉదయం తూర్పు లోని 11వ డివిజన్ రెల్లిస్ కాలనీ ఏరియాలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ పర్యటించారు. వార్డు సభను నిర్వహించి స్థానికంగా ఉన్న వారిలో మాట్లాడారు. వారు తెలియజేసిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం డివిజన్‌లో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా ఫించన్ల నగదును అందచేశారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటి దగ్గరకే వెళ్ళి 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీ రాగానే ఉదయం 6 గంటలకే నేరుగా పింఛన్లు అందజేస్తూ పేద ప్రజల కళ్లల్లో ఆనందం చూస్తున్నామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. విజయవాడ నగర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా బుధవారంనాడు నిర్వహించిన 'పేదల ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం' పండుగ వాతావరణంలో జరిగిందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు సారథ్యంలో నిర్వహించిన ఈ పేదలకు పట్టాభిషేకం కార్యక్రమం ద్వారా విజయవాడ తూర్పు, సెంట్రల్, పశ్చిమ నియోజకవర్గాల్లోని పేద ప్రజలకు భారీ స్థాయిలో శాశ్వత లబ్ధి చేకూరిందన్నారు. ఈ పట్టాల మంజూరుకు తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చూపిన చొరవ అభినందనీయమని ఎంపీ శివనాథ్ కొనియాడారు. స్థానిక ఎమ్మెల్యే గద్దె నియోజకవర్గంలోని పేదల అవసరాలను గుర్తించి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి అత్యధిక సంఖ్యలో పట్టాలు ఇప్పించారని ప్రశంసించారు. ఆయన నాయకత్వంలో నియోజకవర్గంలో పార్టీ కేడర్ అత్యంత పటిష్టంగా ఉందని, పట్టాల పంపిణీతో పేద కుటుంబాలు నేడు లక్షాధికారులుగా మారాయని ఎంపీ అన్నారు. పేదలకు ఇంతటి చారిత్రాత్మక కానుకను అందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు విజయవాడ ప్రజల తరఫున కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ పేదల సంక్షేమంలో తెలుగుదేశం పార్టీదే అగ్రతాంబూలమని అన్నారు. విజయవాడలో 26 వేల ఇళ్ల పట్టాల పంపిణీతో పేదలను లక్షాధికారులను చేశామన్నారు. విజయవాడ నగరంలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించే విషయంలో ఎల్లప్పుడూ తెలుగుదేశం పార్టీయే అగ్రభాగంలో ఉంటుందని చెప్పారు. పేదల సంక్షేమం పట్ల నిబద్ధతతో కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఆనాడు నందమూరి తారక రామారావు విజయవాడ నగరంలో ఒకేసారి 10 వేల పట్టాలు పంపిణీ చేసి పేదలకు శాశ్వత గూడు కల్పించారని, ఆ కార్యక్రమానికి గుర్తుగా ఇప్పటికీ నగరంలో పైలాన్ నిలిచి ఉందన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గజం స్థలం రూపాయి, రూపాయిన్నరకే నామినల్ ధరకు పేదలకు భూములను సొంతం చేసిన చరిత్ర టీడీపీ సొంతమని కొనియాడారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం విజయవాడ నగరంలో ఏకంగా 26 వేల ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం వల్ల నగరంలోని పేద కుటుంబాలన్నీ లక్షాధికారులుగా మారే అవకాశం లభించిందన్నారు. గతంలో 'నల్ల చెరువు'గా పిలిచే రెల్లీస్ కాలనీ భూములను చెరువు భూములుగా పేర్కొంటూ పట్టాలు ఇచ్చేందుకు అడ్డంకులు ఉండేవని, తాను ఎంపీగా ఉన్న సమయం నుంచి, అనంతరం 2014--19 మధ్యకాలంలోనూ ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళానని గద్దె చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల ప్రభుత్వంలో ఈ అంశాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఇప్పుడు తమ ప్రభుత్వం రాగానే ఈ అంశాన్ని పరిష్కరించామన్నారు. 2024లో ఎంపీ కేశినేని చిన్ని నాయకత్వంలో, నగర ఎమ్మెల్యేలు బోండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి, తాను కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి పరిశీలించి అర్హులకు పట్టాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారని చెప్పారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో తదితర అధికార యంత్రాంగం ఆరు నెలల పాటు నిరంతరం శ్రమించి పేదలకు పట్టాలు అందచేశారన్నారు. ఇతర ఆస్తిదారుల తరహాలోనే పేదలు కూడా అవసరమైతే బ్యాంకు రుణాలు పొందడానికి, పిల్లల భవిష్యత్తు కోసం ఉపయోగించుకోవడానికి కూటమి ప్రభుత్వం అందచేసిన పట్టాలు ఉపయోగపడతాయన్నారు. దసరా, సంక్రాంతి, దీపావళి, రంజాన్, క్రిస్మస్ పండుగలన్నీ ఒకేసారి వస్తే కుటుంబంలో ఎంతటి సంతోషం ఉంటుందో, పేదల చేతుల్లో లక్షల రూపాయల విలువైన స్థిరాస్తి పట్టాలు ఉండటం అంతటి మహా పండుగని గద్దె అన్నారు. ఈ మహత్తర అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లకు పేద ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాదెళ్ల రాజేష్, కోనేరు రాజేష్, కిలారు శ్రావణ్, మమ్మనేని ప్రసాద్, జాస్తి సురేష్, బంగారు మురళి, పామర్తి కిషోర్, యర్నేని వేదవ్యాస్, గరికపాటి బద్రి, పడాల గంగాధర్, అబ్దుల్ కలామ్, కోడూరు ఆంజనేయ వాసు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, మారుతి, సుగుణ, అధికారులు చంద్రశేఖర్, జోనల్ కమిషనర్ షమీ, ఉమామహేశ్వరి,శాంతి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి.. సంక్షేమం, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం

**పరిశ్రమల రాకతో సత్యసాయి జిల్లా, పుట్టపర్తి నియోజకవర్గ రూపురేఖల్లో సమూల మార్పు**

**సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్ తో ఏపీకి రెండేళ్లలో 25 లక్షల కోట్ల పెట్టుబడులు**



పేదల సేవలో కూటమి ప్రభుత్వం 2.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర, కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె

అనంత పురం బ్యూరో అక్టోబర్ 01 నేటి శుభోదయ: అభివృద్ధి, సంక్షేమం ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతాయని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. నల్లమాడ మండలంలో నిర్వహించిన 'పేదల సేవలో కూటమి ప్రభుత్వం 2.0' కార్యక్రమంలో వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబానికి సుమారు రూ.1.50 లక్షల వరకు లబ్ధి చేకూరుతోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తూ సంక్షేమంతో పాటు ఉపాధి, మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంపై అప్పుల భారం పెరిగిందని, ఒక్కో కుటుంబంపై సుమారు రూ.5 లక్షల అప్పు భారం పడిందని వారు విమర్శించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోందన్నారు.

### పుట్టపర్తికి భారీ పరిశ్రమలు.. వేలాది ఉద్యోగాలు

పుట్టపర్తి నియోజకవర్గంలో భారీ పరిశ్రమలు ఏర్పాటు కానుండటం ప్రాంత అభివృద్ధికి కీలక మలుపు కానుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అన్నారు. పుట్టపర్తి ప్రాంతంలో సుమారు రూ.లక్ష కోట్ల పెట్టుబడితో 5వ తరం యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఆమడగూరులో రిలయన్స్ సహకారంతో సుమారు రూ.51 వేల కోట్లతో భారీ సోలార్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు కానుండటం సత్యసాయి జిల్లాకు గొప్ప అవకాశమన్నారు. ఈ పరిశ్రమలు, పెట్టుబడుల ద్వారా నియోజకవర్గంలో సుమారు 25 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందన్నారు.భారీ పరిశ్రమలు, పెట్టుబడులు రావడంతో పుట్టపర్తి నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే తెలిపారు.



### సత్యసాయి జిల్లాకు పరిశ్రమలు గొప్పవరంలి

సత్యసాయి జిల్లాకు కియా కార్ల పరిశ్రమతో పాటు పుట్టపర్తిలో యుద్ధ విమానాల తయారీ ప్రాజెక్టు రావడం గొప్ప వరమని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్నారు. భూ సమస్యలపై త్వరలో ఇంటింటికీ భూ సర్వేసత్యసాయి జిల్లాలో త్వరలో ఇంటింటికీ భూ సర్వే కార్యక్రమం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. భూ సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డులను మరింత పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

### పి-4 మార్గదర్శులకు సన్మానం

పి-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను తీర్చిదిద్దేందుకు మార్గదర్శకత్వం అందించిన మార్గదర్శులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఘనంగా సన్మానించారు. పేద కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల సహకారం అవసరమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పి-4 మార్గదర్శులు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అధిక లోడుతో వెళ్తున్న రెండు ఇసుక లారీలు సీజ్

**-ఎట్టకేలకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆదేశాలపై స్పందించిన అధికారులు.**



పెనమలూరు, అక్టోబర్ 1నేటి శుభోదయ: కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గంలోని చోడవరం నుంచి పెనమలూరు వైపు వస్తున్న ఇసుక లారీలను పోలీసులు అడ్డుకున్నారు. ఆరు నెలలుగా అక్రమంగా, అధిక లోడుతో ఇసుక తరలిస్తున్న లారీలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు ఇసుక లారీలను తనిఖీ చేశారు.నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్నట్లు గుర్తించిన రెండు లారీలపై కేసులు నమోదు చేశారు.కేసులు నమోదు చేసిన అనంతరం రెండు లారీలను పెనమలూరు ఎమ్మార్వో కార్యాలయానికి పోలీసులు తరలించారు.అధిక లోడుతో ఇసుక రవాణాపై ఇకపై కఠిన చర్యలు ఉంటాయా అన్నదే చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే ఫిర్యాదుపై అధికారులు స్పందించడంతో అక్రమ ఇసుక రవాణాదారుల్లో కలకలం రేగుతోంది.

## సీఐ ఉస్మాన్ షరీఫ్ కు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీజే బృందం



ఖమ్మం, అక్టోబర్ 01, నేటి శుభోదయ :: ఖమ్మం మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నూతన బాధ్యతలు చేపట్టిన ఉస్మాన్ షరీఫ్ ను మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్ ఆధ్వర్యంలోని బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా సీఐ ఉస్మాన్ షరీఫ్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ ఖాసిమ్, జనరల్ సెక్రటరీ ఎస్.డి. నాసర్ అహ్మద్, ట్రెజరర్ ఎం.డి. హకీమ్, మాజీ షాదీఖానా చైర్మన్ ఎం.డి. మజీద్, ఎంపీజే సభ్యులు రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'గ్రామ గ్రామాన మెరుగైన రహదారుల నిర్మాణం.. నియోజకవర్గ అభివృద్ధికి కొత్త ఊపిరి..!'

**- చినకొండేపూడిలో రూ.4.18 కోట్లతో భారీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..**

**- రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ..**



కోరుకొండ, అక్టోబర్ 1, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);రాజానగరం నియోజకవర్గంలో సుదూర గ్రామీణ ప్రాంతాలకు పటిష్టమైన రవాణా వసతులు కల్పించి, ప్రజల ప్రయాణ కష్టాలను శాశ్వతంగా పారద్రోలడమే తమ ముఖ్య ధ్యేయమని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలిపారు. సీతానగరం మండలం చినకొండేపూడి గ్రామంలో రూ.4.18 కోట్ల భారీ అంచనా వ్యయంతో చినకొండేపూడి నుండి చీపురుపల్లి వరకు (వయా పెదకొండేపూడి) నిర్మించనున్న నూతన బీటీ రహదారి నిర్మాణ పనులకు ఆయన గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ... 'చినకొండేపూడి, పెదకొండేపూడి మరియు చీపురుపల్లి పరిసర గ్రామాల ప్రజలకు, రైతులకు, వ్యాపారులకు మరియు విద్యార్థులకు ఈ మార్గం అత్యంత కీలకమైన అనుసంధాన రహదారి. గతంలో గుంతలమయంగా మారి ప్రమాదభరితంగా ఉన్న ఈ రహదారిని పూర్తిస్థాయిలో పునర్నిర్మించేందుకు రూ.4.18 కోట్లు భారీ నిధులు మంజూరు చేయించడం జరిగింది. ఈ నూతన రహదారి అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు రవాణా వ్యవస్థ మరింత సురక్షితం, వేగవంతం అవుతుంది. పనుల్లో నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించాం' అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, జనసేన, తెలుగుదేశం,బిజెపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 'ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట..'

– ఇనుగంటివారిపేటలో రూ.42 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన..

– 'రుడా' చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి.



కోరుకొండ, అక్టోబర్ 1, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె):తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ, రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని రూడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. సీతానగరం మండలం ఇనుగంటివారిపేట గ్రామంలో రూ.42 లక్షల అంచనా వ్యయంతో చిక్కాల దేవానంద్ ఇంటి వద్ద నుంచి లంకాలమ్మ గుడి వరకు నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, బొడ్డు వెంకటరమణ చౌదరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడితే ప్రజల దైనందిన ప్రయాణాలతో పాటు వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్యం వంటి అన్ని రంగాలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. ఇనుగంటివారిపేటలో లంకాలమ్మ ఆలయానికి వెళ్లే ప్రధాన మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం ద్వారా గ్రామస్తులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులకు కూడా మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. రాజానగరం నియోజకవర్గంలో గ్రామీణ రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని బొడ్డు వెంకటరమణ చౌదరి తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పండుగ వాతావరణం లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం



నేటి శుభోదయ ప్రతినిధి దేవి పట్నం 1-9-2026 దేవీపట్నం మండలం ఇందుకూరు గ్రామ పంచాయతీ పరిధిలోగల ఇందుకూరు గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్థానిక శాసన సభ్యురాలు శ్రీమతి మిరియాల శిరీష దేవి ఆధ్వర్యంలో దేవీపట్నం మండల అధ్యక్షులు గోళ్ళ చంటిబాబు అధ్యక్షతన క్లస్టర్ ఇంచార్జ్ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందించడం జరిగింది అలాగే కొత్తగా మంజూరైనటువంటి స్పౌంజ్ పెన్షన్ కోసు రాధా అనే ఆమెకు ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత మాజీ కార్యదర్శి చవళం శివరామకృష్ణ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి ముచ్చు బాబురావు మండల బీసీ సెల్ అధ్యక్షులు ముచ్చు త్రిమూర్తులు పీసా ఉపాధ్యక్షురాలు కందికొండ గౌరీశ్వరి సచివాలయ గ్రామ పోలీస్ రాజ్యలక్ష్మి డ్వాక్రా మహిళ ఉమ్మి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# గాంధీ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకం

: మాజీ ఎంపీ నామ

– సత్యం, అహింస, శాంతి విలువలను ఆచరించాలి : మాజీ ఎంపీ నామ



ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన పాత్ర చిరస్మరణీయమని నామ గుర్తుచేశారు. అహింస, సత్యాగ్రహం, సహనం వంటి ఆయుధాలతో ప్రజలను ఏకం చేసి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహోద్యమాన్ని నడిపించిన మహనీయుడని పేర్కొన్నారు. గాంధీజీ జీవితం, ఆయన ఆలోచనా విధానం ప్రతి తరానికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం జరగాలని, ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు లభించాలని గాంధీజీ ఆకాంక్షించారని నామ ప్రస్తావించారు. గ్రామీణ భారతం అభివృద్ధి చెందితేనే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందనే గాంధీజీ ఆలోచనలను గుర్తుచేశారు. గ్రామ స్వరాజ్యం, స్వావలంబన, సామాజిక సమానత్వం వంటి ఆయన ఆశయాలు నేటికీ ప్రాధాన్యత కలిగి ఉన్నాయని వివరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనూ శాంతియుత ప్రజాస్వామ్య పోరాటం ద్వారా రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సుదీర్ఘంగా పోరాడారని నామ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రజాస్వామ్య పద్ధతుల్లో ముందుకు తీసుకెళ్లి రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. కేసీఆర్ పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారని నామ గుర్తుచేశారు. పల్లె ప్రగతి, గ్రామ పంచాయతీల బలోపేతం, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడం వంటి చర్యల ద్వారా గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించారని వివరించారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయడం గాంధీజీ గ్రామ స్వరాజ్య ఆలోచనలకు అనుగుణంగా ఉందని తెలిపారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ, గాంధీజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని నామ కోరారు.

# విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమానికి సంఘం కట్టుబడి ఉంది

– సూపర్ సీనియర్ పోలీసు అధికారులు– దంపతులకు ఘన సన్మానం



ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: విశ్రాంత పోలీసు అధికారుల ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, ఆత్మీయతకు ప్రాధాన్యతనిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు తెలిపారు.సంఘం ఖమ్మం జిల్లా సర్వసభ్య సమావేశం గురువారం ఖమ్మం నగరంలోని ఈఈఆర్ రిసార్ట్‌లో అధ్యక్షుడు ఆర్. రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి రుద్ర వెంకటనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 75 నుంచి 80 ఏళ్ల వయస్సు కలిగిన సూపర్ సీనియర్ విశ్రాంత పోలీసు అధికారులు, వారి సతీమణులను ఘనంగా సన్మానించారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ఆల్ పెన్షనర్స్ సంఘాల గౌరవాధ్యక్షుడు ఏర్నేని రామారావు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న విశ్రాంత పోలీసు అధికారులను వారి జీవిత భాగస్వాములతో కలిపి సన్మానించడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సూపర్ సీనియర్లలో ఆనందం, ఆత్మీయతను పెంపొందిస్తాయని, భవిష్యత్తులోనూ కొనసాగించి ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలని కోరారు.

## - ఆరోగ్యానికి ప్రాధాన్యత

సంఘం నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య శిబిరాలు సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయని వక్తలు తెలిపారు. వయస్సు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి సభ్యుడు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంఘ సభ్యుడు మరణించినప్పుడు వారి కుటుంబానికి రూ.25,000 నగదు సహాయం అందిస్తూ, కష్టకాలంలో అండగా నిలుస్తున్నామని తెలిపారు. సభ్యుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాలకు భరోసా కల్పించడం సంఘం ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు.సంఘం గౌరవాధ్యక్షులు ఎస్.వి. ప్రతాపరెడ్డి, విశ్రాంత అదనపు ఎస్పీ; ముఖ్య సలహాదారు బిల్లా అశోక్ కుమార్, విశ్రాంత అదనపు ఎస్పీ; ఆర్. సాయి బాబా, విశ్రాంత అదనపు ఎస్పీ; వ్యవస్థాపక అధ్యక్షుడు హకీమ్; విశ్రాంత డీఎస్పీలు టి. ఈశ్వరయ్య, టి. సదానంద్ సింగ్, కె. నర్సయ్య, ఆకుల వెంకయ్య; విశ్రాంత ఇన్‌స్పెక్టర్ నాగయ్య; సంఘం ఉపాధ్యక్షులు ఎస్. సంజీవరావు, బి. నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

## - సూపర్ సీనియర్ దంపతులకు సన్మానం

పోలీస్ శాఖలో విశిష్ట సేవలందించిన సూపర్ సీనియర్ విశ్రాంత పోలీసు అధికారులు డాక్టర్ హలవత్ శీతల నాయక్, డాక్టర్ జె.ఎస్.కె. తులసీదాస్, సిహెచ్. రంగారావు, గులాం దస్తగిరి, సయ్యద్ ముస్తఫా, గడ్డం బాబురావు, బి. మోజస్, ఎం. బాబురావు, పి.ఎం. ముకుందరావు, మేకల ఇజ్రాయిల్ దంపతులను సన్మానించారు.సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ తమ సేవలను గుర్తించి దంపతులను కలిపి సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. వయోభారంతో ఒంటరితనానికి గురవుతున్న వృద్ధులకు ఇలాంటి కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, భవిష్యత్తులోనూ మరిన్ని ఆత్మీయ, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో సంఘం కార్యనిర్వాహక సభ్యులు ఎస్.కె. సిద్ధయ్య, పల్లిపాడు సత్యనారాయణ, కోశాధికారి కె. సోమయ్య తదితరులతో పాటు సుమారు 300 మంది విశ్రాంత పోలీసు అధికారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.దివంగత ఐజీపీ బొమ్మకంటి శంకర్రావు ఐపీఎస్ స్మారకార్థం సంఘం కార్యాలయ నిర్మాణానికి ఆయన కుటుంబ సభ్యులు రూ.30 లక్షల వరకు ఆర్థిక సహాయం ప్రకటించినందుకు, వారి కుటుంబానికి సంఘం ఏకగ్రీవంగా అభినందనలు తెలిపింది.



# బరిలో నువ్వా నేనా




ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలలో ఖమ్మం సేవకులం ప్రజల లక్ష్యంగా మానవతే మార్గంగా సమాజసేవే మన బాధ్యతగా అనే నినాదంతో లక్ష్యంతో కే ఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో ప్యానెల్ నుండి ఎన్నికల బరిలోకి దిగుతున్న అభ్యర్థులు వీరే. డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు డాక్టర్, కూరపాటి ప్రదీప్ కుమార్, డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, డాక్టర్ కేశాని మారుతి రావు, ప్రముఖ న్యాయవాది అర్కార శ్రీరామారావు, సామాజిక వేత్త అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఏ. ఏ శ్రీనివాసరావు లెక్చరర్ కామర్థపు గోపాలరావు, కొల్లా రవీందర్, పిట్టల వెంకట నరసయ్య,, కరివేద వెంకట శ్రీనివాసరావు, రావుల కిషోర్ రెడ్డి, జయంతి లాల్ పటేల్, కే కిరణ్ కుమార్ మురిశెట్టి సౌజన్య, ఎర్రగడ్ల రాఘవరావు తదితరులు పోటీ చేస్తున్నారు. మానవత్వం ద్వారా శాంతి, సేవ తత్పరత ను గుర్తిద్దాం. సేవను ప్రోత్సాహిద్దాం నిరంతరం సమాజ సేవకులు అని ధ్యేయంతో ముందుకు సాగిపోదాం అని లక్ష్యంతో ఖమ్మం జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికలలో మరో ప్రముఖు లు పోతాను పోటీగా ఎన్నికల రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికలలో పోటీ దిగుతున్న మరో వర్గం ప్రముఖుల పేర్లు ఇవే. డాక్టర్. వెలిగేటి చంద్రమోహన్, ఏ గోవర్ధన్ రావు, జి నాగేశ్వరరావు, కే శ్రీనివాస్ నందన్, కే సత్యనారాయణ రెడ్డి, కే లింగమూర్తి , ఎం శ్రీహరి, కే నర్సయ్య. టి. రాఘవయ్య, ఆర్ రవీంద్రరావు, ఎస్ జనార్ధన్ రావు, ఎస్ వెంకటేశ్వర్లు పి సుధాకర్, సూర్య ప్రకాష్ రావు, జే వెంకటేశ్వర్లు. వరిలో ఉన్న. 15 పోస్టులకు 39 మంది బరిలో ఉన్నారు. ఈ ఆదివారం అక్టోబర్ 4 ఖమ్మం ని ఇల్లందు క్రాస్ రోడ్ లో ని టీటీడీసీ భవనంలో ఎన్నికలు నిర్వహించబడుతున్నాయి ఈ పోటీ లు రసవత్త దయకంగా ఉన్నాయి. ఎవరికి వారే వారి వారి అభ్యర్థులు గెలుపు కోసం అహర్నిశలు ప్రచార హోరులో నిమగ్న మై ఉన్నారు రిజల్ట్ స్కై ఆదివారం సాయంత్రం వరకు వేచి ఉండాల్సిదే మరి.




# ఎన్టీఆర్ భరోసాతో సామాజిక భద్రత..!

రూ.80 లక్షలతో వెల్దుర్తిలో నూతన సీసీ రోడ్ల నిర్మాణం

పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి




వెల్దుర్తి: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 1 ; నేటి శుభోదయ :ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సామాజిక భద్రతకు అండగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పింఛన్ల పంపిణీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి నెలా ఒకటో తేదీన అర్హులైన లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పింఛన్లు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయం కుటుంబాల రోజువారీ అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే స్థానికంగా ఉన్న రహదారులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో భాగంగా వెల్దుర్తిలో రూ.80 లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కాలనీల్లో రహదారుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ, రహదారి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా, నిర్ణీత సమయంలో నిర్మాణాలను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు, అభివృద్ధి పనులతో గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. స్థానిక సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులుసు శివారెడ్డి, జూలకంటి చిరంజీవిరెడ్డి, అక్కిరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# వృద్ధుల సంక్షేమమే సమాజ బాధ్యత

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంత జీవనం.. ప్రేమ, ఆప్యాయతలతో ముందుకు సాగాలి

వృద్ధులకు ఫలాలు, బిస్కెట్ల పంపిణీ




మాచర్ల, అక్టోబర్ 1: ఆర్ సి ఇన్చార్జ్ నేటి శుభోదయ: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సేవాశ్రమంలో బుధవారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా జడ్జి ఆదేశాల మేరకు, మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కళ్యాణ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంత్ సూచనలతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల న్యాయ సేవా కమిటీ సభ్యులు, పల్నాడు జిల్లా దిశ కమిటీ సభ్యులు, శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లతో పలువురు వృద్ధులు జీవనం సాగిస్తున్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందులు, తోడుగా ఉండేవారు లేకపోవడం, ప్రేమాభిమానాలతో పలకరించే వారు లేకపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వృద్ధులు ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవడంతో పాటు మంచి పుస్తకాలు చదవడం, ధ్యానం చేయడం ద్వారా మానసిక ప్రశాంతతను పొందాలని సూచించారు. ఈర్ష్య, అసూయలకు దూరంగా ఉంటూ సోదరభావంతో అందరితో కలిసిమెలిసి జీవించాలని కోరారు. పిల్లలు తమను పట్టించుకున్నా, పట్టించుకోకపోయినా ఇతరులను కుటుంబ సభ్యులుగా భావించి ప్రేమ, ఆప్యాయతలతో మెలగడం ద్వారా జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చని పేర్కొన్నారు. భగవంతునిపై విశ్వాసంతో సానుకూల ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమం అనంతరం సేవాశ్రమంలోని వృద్ధులకు ఫలాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయ సేవా కమిటీ ప్రతినిధులు, సేవా సమితి సభ్యులు, ట్రస్ట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# శాసనకోట జడ్పీ హైస్కూల్‌ను పరిశీలించిన మంత్రి సవిత



అనంత పురం అక్టోబర్ 01 నేటి శుభోదయ: పరిగి మండలం శాసనకోట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి శ సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పదో తరగతి ఫలితాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులతో మంత్రి సవిత నేరుగా మాట్లాడి వారి చదువు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు, పదో తరగతి ఫలితాలపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం, విద్యార్థుల ప్రతిభను వెలికితీయడం, విద్యా ప్రమాణాలను పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల అవసరాలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ దిశ హాస్పిటల్‌లో రుమటాలజీ మరియు డెంటల్ విభాగాల ప్రారంభం



ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలోని పాత సీపీఐ కార్యాలయం పక్కన నెహ్రూనగర్‌లో ఉన్న శ్రీ దిశ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రుమటాలజీ మరియు డెంటల్ విభాగాలను ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు, ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ కమిషనర్ పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, పేదలు, సామాన్య ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించాల్సిన బాధ్యత ఆసుపత్రులపై ఉందని అన్నారు. ప్రస్తుతం అన్ని రకాల కాలుష్యాలు పెరుగుతున్న నేపథ్యంలో రుమటాలజీ, కీళ్లవాతం వంటి వ్యాధులు అధికమవుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రజలకు రుమటాలజీ వంటి ప్రత్యేక వైద్య విభాగం అందుబాటులోకి రావడం ఎంతో అవసరమని తెలిపారు. ఉన్నత వైద్య విద్యను అభ్యసించి గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించేందుకు ఖమ్మం వచ్చిన ప్రముఖ రుమటాలజిస్ట్ డాక్టర్ మద్దినేని అభిచరణ్ ఆయన అభినందించారు. సాధారణంగా రుమటాలజీ విభాగాలు హైదరాబాద్ వంటి పెద్ద నగరాల్లోనే ఎక్కువగా అందుబాటులో ఉంటాయని, ఖమ్మంలో శ్రీ దిశ హాస్పిటల్ యాజమాన్యం ఈ ప్రత్యేక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. డెంటల్ విభాగాన్ని ప్రారంభించిన ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు మాట్లాడుతూ ఆధునిక ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతింటున్న పరిస్థితుల్లో నైపుణ్యం కలిగిన వైద్య సేవలను ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చిన శ్రీ దిశ హాస్పిటల్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందిని ఆయన అభినందించారు. అనంతరం గ్యాస్ట్రో విభాగాన్ని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, ఎక్స్‌రే యంత్రాన్ని గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షులు బి. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఖమ్మం నగరంలో సామాన్య ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తూ, వివిధ వైద్య విభాగాలను ఒకే చోట అందిస్తున్న శ్రీ దిశ హాస్పిటల్ యాజమాన్యాన్ని, వైద్యులను, వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఛాతీ వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి రానా దేవ్, డెంటల్ వైద్యులు డాక్టర్ స్వాతి, డాక్టర్ స్పర్శ భాస్కర్, సీనియర్ న్యాయవాది బిచ్చాల తిరుమలరావు, జర్నలిస్ట్ యూనియన్ నాయకులు చిర్రా రవి, హాస్పిటల్ మేనేజ్‌మెంట్ మేకల సుగుణారావు, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు పిట్టల నాగేశ్వరరావు, సలీం, విద్యావంతుల వేదిక నాయకులు నరేందర్, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరావు, బీఆర్ఎస్ నాయకులు మొర్రిమేకల కోటయ్య, సోమనబోయిన రమేష్, రవి, అనిల్, అజయ్, తోడేటి లింగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## 18వ డివిజన్‌లో టౌన్ ప్లానింగ్ సమస్యల పరిష్కారంపై సమీక్ష సమావేశం నిర్వహించిన ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్



ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: గురువారం ఖమ్మం సుడా కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ సమీక్ష సమావేశం నిర్వహించారు. గత నెల ఖమ్మం నగరంలోని 18వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించేందుకు చైర్మన్ పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్లపై ర్యాంపుల ఏర్పాటు, రహదారులకు సంబంధించిన ఇబ్బందులు, ఇతర టౌన్ ప్లానింగ్ సమస్యలను స్థానికులు వివరించారు. ఈ సమస్యలపై అప్పట్లోనే స్పందించిన చైర్మన్ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో 18వ డివిజన్‌లో గుర్తించిన సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, పూర్తయిన పనులు, ఇంకా పరిష్కరించాల్సిన అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లపై ర్యాంపులు తదితర టౌన్ ప్లానింగ్ సంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించాలని, పెండింగ్‌లో ఉన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి, పరిష్కారానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని చైర్మన్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మాజీ కార్పొరేటర్ మండడపు లక్ష్మీ మనోహర్ , టౌన్ ప్లానింగ్ డీసీపీ, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్లు, టీపీబీఓలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో ప్రధాని మోడీ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించిన బిజెపి నేతలు..!

– ముఖ్యఅతిథిగా రాజానగరం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కూటమి సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి..!



కోరుకొండ, అక్టోబర్ 1 : నేటి శుభోదయం ప్రతినిధి (ఏ.కె); భారత ప్రధాని నరేంద్ర మోడీ 78వ జన్మదినోత్సవం పరిష్కరించుకొని భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో 'సేవా సంకల్ప అభియాన్' మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజానగరం మండలం కొత్త వెలుగుబంద అంగనవాడి సెంటర్లలో బాల బాలికలను బిజెపి నేతలు, కార్యకర్తలు కలిసి ప్రధాని మోడీ సేవా కార్యక్రమాలు, జీవిత చరిత్ర పట్ల అవగాహన కల్పించారు. యువ మోర్చా మండల అధ్యక్షులు ప్రగడ కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కూటమి సీనియర్ నాయకుడు నీరుకొండ వీరన్న చౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు కార్యకర్తలు అంగన్వాడి పిల్లలతో ఆత్మీయంగా గడిపారు. బిజెపి నేత వీరన్న చౌదరి బాల బాలికలతో కొద్దిసేపు ముచ్చటించారు. సందర్భంగా అంగన్వాడి ప్రజలకు బిస్కెట్స్, ఫ్రూట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో. రాజానగరం మండలం బిజెపి అధ్యక్షులు ఆళ్ల శివ నాగరాజు, బిజెపి, కూటమి నాయకులు అంగన్వాడి సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## మంత్రి తుమ్మల కృషితో ఇంటిగ్రేటెడ్ కార్యాలయానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

– ఇంటిగ్రేటెడ్ ఆర్డీవో కార్యాలయం మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, రెవిన్యూ మంత్రి పొంగులేటికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు

– ఖమ్మంలో ఆధునిక ఆర్డీవో కార్యాలయ సముదాయానికి మోక్షం

– ఒకే గొడుగు కింద రెవెన్యూ సేవలు

– ప్రజలకు తప్పనున్న తిప్పలు



ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ :::ధాన్యాగారంగా, వాణిజ్య కేంద్రంగా పేరొందిన ఖమ్మం గడ్డపై పాలనా సౌధాలు కాలానుగుణంగా కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. పొలం హద్దుల నుంచి ధ్రువీకరణ పత్రాల వరకు, భూ వివాదాల నుంచి సంక్షేమ దరఖాస్తుల వరకు ప్రతి రెవెన్యూ పనికీ గ్రామీణులు జిల్లా కేంద్రానికి వచ్చి, ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరగాల్సిన పరిస్థితికి ఇక తెరపడనుంది. ఖమ్మంలో నూతన ఇంటిగ్రేటెడ్ ఆర్డీవో కార్యాలయ సముదాయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి ఫలితంగా ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

### రెవెన్యూ మంత్రి, ముఖ్యమంత్రికి పలుమార్లు విజ్ఞప్తి

ఖమ్మం ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు ఇంటిగ్రేటెడ్ ఆర్డీవో కార్యాలయ సముదాయాన్ని మంజూరు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ని పలుమార్లు కోరారు. ఈ మేరకు లేఖలు కూడా సమర్పించారు. మంత్రి తుమ్మల విజ్ఞప్తులు, నిరంతర కృషికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాకు నూతన ఇంటిగ్రేటెడ్ ఆర్డీవో కార్యాలయ సముదాయాన్ని మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### - జీవో 596తో కదలిక

రెవెన్యూ (డీఏ-సీఎంఆర్ఎఫ్) విభాగం కార్యదర్శి లోకేశ్ కుమార్ డీఎస్ శనివారం (26-09-2026) జీవో ఆర్టీ నంబరు 596 జారీ చేశారు. ఖమ్మం జిల్లాలో కొత్త ఇంటిగ్రేటెడ్ ఆర్డీవో కార్యాలయ సముదాయాన్ని మంజూరు చేస్తున్నట్లు అందులో స్పష్టం చేశారు. ఈ విషయంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)ను కోరారు. గవర్నర్ పేరుతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.

### - ఇప్పటికే పచ్చజెండా ఊపిన ప్రభుత్వం

రెవెన్యూ కార్యాలయ భవనాల విషయంలో ప్రభుత్వం ఇప్పటికే కదిలింది. ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకు కొత్త భవనాలు నిర్మించాలని జూన్ 25న జీవో 375, జులై 14న జీవోలు 427, 428 జారీ అయ్యాయి. ఆ కొనసాగింపుగా, వచ్చిన వినతి మేరకు ఖమ్మం జిల్లాకు ఇంటిగ్రేటెడ్ సముదాయాన్ని ప్రత్యేకంగా మంజూరు చేశారు.

### - ఒకేచోట అన్ని సేవలు, అదే ఇంటిగ్రేటెడ్ లక్ష్యం

ఇంటిగ్రేటెడ్ కార్యాలయం అంటే కేవలం కొత్త భవనం కాదు. వేర్వేరు చోట్ల ఉన్న విభాగాలను ఒకే ప్రాంగణంలోకి తెచ్చి, ప్రజలకు సమయం, శ్రమ, ఖర్చు మిగిల్చే ఏర్పాటు. దరఖాస్తుదారులు ఒక్కో పనికి ఒక్కో కార్యాలయం వెతుక్కోవాల్సిన అవసరం తగ్గుతుందని, అధికారుల మధ్య సమన్వయం మెరుగై ఫైళ్లు వేగంగా కదులుతాయని భావిస్తున్నారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల నుంచి వచ్చే రైతులు, వృద్ధులు, మహిళలకు ఇది పెద్ద ఊరట కానుంది.

### - ఆధునిక సౌకర్యాలతో, అత్యాధునిక సాంకేతికతతో

ఈ సముదాయాన్ని ఆధునిక సౌకర్యాలతో, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించనున్నారు. డిజిటల్ విధానాలతో పౌరసేవలు వేగంగా, పారదర్శకంగా అందేలా తీర్చిదిద్దాలన్నది ఉద్దేశం. మెరుగైన పని వాతావరణంతో సిబ్బంది పనితీరూ పెరుగుతుందని అంచనా.

### ఖమ్మం అభివృద్ధిలో మరో అడుగు

జిల్లా అభివృద్ధిపై మంత్రి తుమ్మల ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజావసరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ప్రాజెక్టుకు మార్గం సుగమమైందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పుడు నిధుల విడుదల, స్థల నిర్ణయం, నిర్మాణ ప్రక్రియ వేగంగా పూర్తయితే, ఖమ్మం ప్రజలకు ఆధునిక పాలనా సౌధం త్వరలోనే అందుబాటులోకి వస్తుంది.

## వేడుకగా శ్రీమంతాలు



ఖమ్మం, అక్టోబర్ 1, నేటి శుభోదయ ::: పోషణ మాసం ప్రోగ్రామ్ లో బాగంగా గురువారం ఖమ్మం రూరల్ మండల లెవెల్ కార్యక్రమం రెడ్డిపల్లి ప్రైవేటు ఫంక్షన్ హాల్ నందు గర్భిణీ లకు శ్రీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు . ఈ కార్యక్రమం లో పోషక విలువలు గల ఆహారం గురించి. తెలియచేయటం, ప్రోటీన్, విటమిన్స్ గల ఆహారం గురించి తెలియచేయటం జరిగింది. 11 మంది గర్భిణీ లకు శ్రీమంతాలు. 6నెలల పిల్లలు 6 గురి అన్నప్రాసన కార్యక్రమం వేడుకగా జరిపారు. ఈ కార్యక్రమానికి తుంబూరి. దయాకర్ రెడ్డి , ఒకటవ డివిజన్ కౌన్సిలర్ రవీంద్ర సిడిపిఓ కమలప్రియ, ఎం వి పాలెం పీహెచ్సీ డాక్టర్ విజయలక్ష్మి సూపర్వైజర్ మాలతి, పుష్పలత, నీరజ, శకుంతల, డాక్టర్ అంజమ్మ, గోవిందామ్మ,అంగన్వాడీ టీచర్స్, మదర్స్ పాల్గొన్నారు.

## అహింసా మూర్తి... అడుగుజాడలు..!!



యుగ పురుషుని చైతన్య శంఖారావం
శతాబ్దాల బానిసత్వపు చీకటి కోణాల్లో
దిక్కుతోచక అలమటించిన భారతావనికి,
సత్య శోధనతో మార్గం చూపిన
అపూర్వ సూర్యోదయం... మన
గాంధీయం !
ఫిరంగుల మోతల్లేవు, కత్తుల దూకుడు
లేదు
రక్తపాతపు రణరంగాల అరుపులు లేవు,
ధరించిన మోరట ఖద్దరు వస్త్రమే... ఒక
సైన్యమై,
చేతబట్టిన ముసలి చేతికర్రే... ఒక
బ్రహ్మాస్త్రమై,
సామ్రాజ్యవాదపు పునాదులను
కదిలించిన
అహింసా సమరయోధుడు మన
బాపూజీ!
చరఖా చక్రపు తిరుగుడులో...
స్వదేశీ ఆత్మగౌరవాన్ని వడికిన
శ్రామికుడు!
ఉప్పు సత్యాగ్రహపు నడకలో...
జాతి బేధాలను తుడిచేసిన సమతావాది!
హరిజన సేవా దీక్షలో...
మానవత్వపు పరమార్థాన్ని చాటిన
సంస్కర్త!
అక్టోబర్ రెండున
విగ్రహాలకు పూలదండలు
వేసి
ఆ మరుసటి రోజే
ఆశయాలను విస్మరిస్తే
అది గాంధీ జయంతి ఎలా అవుతుంది
ఆయనను కేవలం చరిత్ర పుటలకే
పరిమితం చేస్తే
దేశానికి ముక్తి ఎలా దొరుకుతుంది
స్వచ్ఛత లేని సమాజంలో
స్వరాజ్యమెక్కడిది
హింసతో నిండిన హృదయాల్లో శాంతి
ఎక్కడిది
అవినీతి రొంపిలో తలమునకలవుతూ...
ఆయన కన్న కలల భారతాన్ని ఎలా
సాధిస్తాం
లెగండి! చైతన్య శంఖాన్ని పూరించండి!
మహాత్ముని అడుగుజాడల్లో పునరంకితం
అవ్వండి!
సత్యమే మీ వాక్కుగా, అహింసయే మీ
మార్గంగా,
కులమతాల గోడలను కూల్చే
సమానత్వమే మీ శ్వాసగా,
నవభారత నిర్మాణానికి ప్రతి ఒక్కరూ
నడుం బిగించండి!
బాపూజీ చూపిన శాంతి మార్గంలో
పయనిద్దాం,
ప్రపంచ దేశాల ముంగిట...
భారత కీర్తి పతాకాన్ని సగర్వంగా ఎగుర
వేద్దాం ! (నేడు జయంతి
సందర్భం గా ఆ
మహాత్మునికి అక్షర
నీరాజనం ! )( గిరి ప్రసాద్
సోముల..జర్నలిస్ట్ )



## ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో కలపాలి

– ఆంధ్రప్రదేశ్ సిపియం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు




భద్రాచలం, అక్టోబర్ 01, నేటి శుభోదయ ::: పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజాభీష్టం మేరకు ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని సీపీఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ముంపు మండలాల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు సీపీఎం పోలవరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మోటార్‌సైకిల్ యాత్ర భద్రాచలం సరిహద్దుకు చేరుకుంది.ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలోని రాజుపేట వద్ద సీపీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో యాత్రకు ఘన స్వాగతం పలికారు. సిపిఐఎం భద్రాచలం పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు సంఘీభావం తెలిపారు. రాజుపేట సెంటర్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే అమరజీవి కామ్రేడ్ కుంజ బొజ్జి స్మారక స్థూపానికి ఏపీ రాష్ట్ర కార్యదర్శి బి శ్రీనివాసరావు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం లు పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు కారణంగా ముంపు ప్రభావానికి గురైన గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు తగిన శ్రద్ధ చూపడం లేదని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ, రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వారి సమస్యల పట్ల వివక్ష చూపుతున్నాయని ఆరోపించారు. కన్నాయిగూడెం నుంచి భద్రాచలం వరకు ఉన్న రహదారి దుస్థితిని చూస్తే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థమవుతుందని ఆయన విమర్శించారు. సరిహద్దు గ్రామాల అభివృద్ధి, రహదారులు, రవాణా, మౌలిక వసతుల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎటపాక భద్రాచలం సరిహద్దులో ఉన్న కరకట్ట స్లూయిజ్ మరమ్మత్తుల విషయంలో రెండు ప్రభుత్వాలు ఎవరికి వారే పట్టనట్టు వ్యవహరిస్తూ ప్రజలను ప్రమాదంలోకి నెట్టేస్తున్నారని శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం బ్యాక్‌వాటర్ ప్రభావం నుంచి భద్రాచలం పట్టణాన్ని రక్షించేందుకు కరకట్టను పునర్నిర్మించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని వి. శ్రీనివాసరావు అన్నారు. భద్రాచలం రక్షణకు శాశ్వత పరిష్కారం చూపేలా కరకట్ట పునర్నిర్మాణ పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై శాస్త్రీయమైన అంచనా లేకుండా అడ్డగోలుగా విభజించడం వల్ల ఇప్పుడు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు. పోలవరం ప్రాజెక్ట్ తో భద్రాచలం పట్టణానికి రామాలయానికి సైతం ముంపు తప్పదని నీటిపారుదల శాఖ నిపుణులు హెచ్చరిస్తున్న కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమని అన్నారు. ముంపు మండలాల ప్రజల సమస్యలు పునరావాసం, మౌలిక వసతులు, సరిహద్దు గ్రామాల సమస్యలను ప్రస్తావిస్తూ మోటార్‌సైకిల్ యాత్ర కొనసాగుతోందని వి శ్రీనివాస్ స్పష్టం చేశారు. ప్రజల అభిప్రాయాలు, స్థానిక సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ మోటార్ సైకిల్ యాత్రలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం, పోలవరం జిల్లా నాయకులు లోత రామారావు, బొప్పన కిరణ్, మర్లపాటి నాగేశ్వరరావు, ఐ. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగ, ఐలు జిల్లా నాయకులు ఎం వి ప్రసాద్ రావు, సిపిఎం పట్టణ నాయకులు ఎర్రం శెట్టి వెంకట రామారావు, డి సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు నాదెళ్ల లీలావతి, కొలగాని రమేష్, జీవనజ్యోతి, కనక శ్రీ, డి రాఘవయ్య, అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్ లు మోటార్ సైకిల్ ర్యాలీకి ఘన స్వాగతం పలికారు.

## 7, 8వ వార్డుల వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఐడీ కార్డులు



మాచర్ల: మాచర్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 7, 8వ వార్డులకు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కార్యక్రమానికి హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వార్డులలో పార్టీ కార్యకలాపాలను చురుగ్గా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు.7, 8వ వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందించడం ద్వారా పార్టీ కార్యక్రమాల్లో మరింత సమన్వయం, క్రమబద్ధత ఏర్పడుతుందని పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ భరోసాతో వృద్ధులకు అండ

ప్రతి నెల ఒకటో తేదీన ఠంచన్‌గా పెన్షన్ల పంపిణీ.. పేదల జీవితాల్లో భరోసా నింపడమే లక్ష్యం



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 01; నేటి శుభోదయ :సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 30వ వార్డులో గురువారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 62వ బూత్ ఇన్‌చార్జి, పల్నాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ భాష స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా షేక్ జానీ భాష మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. ప్రతి నెల మొదటి తేదీన పింఛన్లు అందడం వల్ల లబ్ధిదారులు ఇతరుల కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు.పింఛన్లను పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. పేదల కళ్లలో చిరునవ్వు, జీవితాల్లో భరోసా నింపడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. పింఛన్ అందుకున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి నెల సమయానికి పింఛన్ అందడం తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పేర్కొన్నారు.కార్యక్రమంలో 63వ బూత్ ఇన్‌చార్జి కే. శివపార్వతి, జనసేన నాయకుడు షేక్ ఫారుక్, మాజీ ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రసూల్, షేక్ జాన్ అహ్మద్, వార్డు అధ్యక్షుడు మణికంఠ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో అంగన్‌వాడీల పాత్ర కీలకం..!

సఖీ వన్‌స్టాప్ సెంటర్ నిర్మాణానికి భూమిపూజ

చిన్నారులకు పోషకాహారం అందేలా చర్యలు -- ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్01 ; నేటి శుభోదయ : సమాజంలో అంగన్‌వాడీల పాత్ర ఎంతో కీలకమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.మాచర్ల పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో రూ.60 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సఖీ వన్‌స్టాప్ సెంటర్ భవనానికి గురువారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, బాలికలకు అవసరమైన సహాయం, రక్షణ, కౌన్సెలింగ్ వంటి సేవలు ఒకే చోట అందించేందుకు సఖీ వన్‌స్టాప్ సెంటర్ ఉపయోగపడుతుందని తెలిపారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అందుతున్న సేవలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పిల్లల్లో పోషకాహార లోపం తలెత్తకుండా పౌష్టికాహారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను కోరారు. అంగన్‌వాడీలకు నూతన భవనాల నిర్మాణంతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో నియోజకవర్గ ఆర్డీవో మురళీ, ప్రత్యేక అధికారి గ్రబూనాయక్, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సీడీపీవో కృష్ణవేణి, పార్టీ నాయకులు కజ్జం సైదయ్య, యెనుముల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



# 30వ వార్డులో ఇంటింటికీ టీడీపీ

ప్రజలకు కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించిన షేక్ జానీ భాష



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 01; నేటి శుభోదయ : మాచర్ల నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పట్టణంలోని 30వ వార్డులో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఇంటింటికీ టీడీపీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. 62వ బూత్ ఇన్‌చార్జి, పల్నాడు జిల్లా పార్లమెంటరీ సెక్రటరీ షేక్ జానీ భాష ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా వార్డుకు చెందిన పలువురు ప్రజలు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలులో మార్పు కనిపిస్తోందన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా కుటుంబంలో ఎంతమంది అర్హులైన పిల్లలు ఉంటే అంతమందికి ప్రయోజనం అందుతోందని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల పింఛన్లను పెంచడం ద్వారా సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. వార్డులో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటున్నట్లు షేక్ జానీ భాష తెలిపారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత అధికారులతో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో 63వ బూత్ ఇన్‌చార్జి కే. శివపార్వతి, మాజీ ముస్లిం మైనార్టీ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్ రసూల్, జనసేన నాయకులు షేక్ ఫారుక్, షేక్ జాన్ అహ్మద్, వార్డు అధ్యక్షుడు మణికంఠ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మాచర్ల ప్రజల పాలిట మహాదేవుడు చంద్రబాబు..!

ఏడాదిలో తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం

వరికపూడిశెల ప్రాజెక్టుకు త్వరలో షెడ్యూల్ ప్రకటిస్తాం: ఎంపీ లావు

స్థానిక ఎన్నికల్లో రెచ్చిపోతే చట్ట ప్రకారం చర్యలు తప్పవు: ఎమ్మెల్యే జూలకంటి



మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 1 నేటి శుభోదయ :పల్నాడు జిల్లాలో వెనుకబడిన మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. గురువారం మాచర్ల పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్‌లో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (నాబీ) విధానంలో రూ.36 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు వారు శంకుస్థాపన చేసి, పైలాన్‌ను ఆవిష్కరించారు.

## ఏడాదిలో తాగునీటి సమస్యకు పరిష్కారం

మాచర్ల నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడికి వచ్చే ఏడాది నాటికి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. జల్ జీవన్ మిషన్, అమృత్ పథకాల ద్వారా సుమారు రూ.1,000 కోట్లతో వాటర్ గ్రిడ్ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. నాబీ విధానంలో మాచర్ల మున్సిపాలిటీ పరిధిలో సెంటర్ డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్లు, డ్రైన్లు, పార్కుల అభివృద్ధి వంటి పనులు చేపడుతున్నట్లు వివరించారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి త్వరలో షెడ్యూల్ ప్రకటించి పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు.

## గత పాలనపై ఎమ్మెల్యే జూలకంటి విమర్శలు

మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పుకుంటున్నారని, అయితే నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రశ్నించారు. గతంలో నియోజకవర్గంలో అరాచకం, రౌడీయిజం చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. స్థానిక ఎన్నికల్లో అలజడులు సృష్టించేందుకు ప్రయత్నిస్తే చట్ట ప్రకారం తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.పిన్నెల్లి సోదరుల హయాంలో మాచర్లలో హింసాత్మక పరిస్థితులు నెలకొన్నాయని, పలువురు నాయకులు ఇబ్బందులకు గురయ్యారని ఎమ్మెల్యే ఆరోపించారు. గతంలో తమను నమ్ముకున్న నాయకులను కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఈ సందర్భంగా పిన్నెల్లి కుటుంబంపై పలు తీవ్ర ఆరోపణలు చేశారు.కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి గ్రబూ నాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కూటమి పార్టీల నాయకులు ధారునాయక్, మంజూల రెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, నల్లపాటి రాము, కజ్జం సైదయ్య, రాజబోయిన మధు, సాతులూరి కుమార్, కొమెర దుర్గారావు, యెనుముల కేశవరెడ్డి, మాచర్ల వాసు, మదార్ సాహెబ్, బృంగా రమణరావు, మున్నాం రాంబాబు, మద్దిగపు వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# "కూటమి నాయకుల సహకారంతో పట్టణ అభివృద్ధి మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు

తాడేపల్లిగూడెం అక్టోబర్ 1 (నేటి శుభోదయ) కూటమి నాయకుల సహకారంతో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు. గురువారం నేటి శుభోదయ తో మాట్లాడుతూ రెండు కోట్ల ఎస్సీ నిధులు, మరో రెండు కోట్లు ఎమ్మెల్యే నిధులతో పట్టణంలోని ఎస్సీ ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. జీవి మాల్ రోడ్డు, ఫుడ్ కోర్టు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. శాసనసభ్యులు సహకారంతో పట్టణ రూపురేఖలను మార్చడం జరిగిందన్నారు. తాను పట్టణంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత శాసనసభ్యులు వారు సహకారంతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. శాసనసభ్యులు ప్రభుత్వంతో మాట్లాడి మరో 33 కోట్ల రూపాయలు పట్టణ అభివృద్ధి కోసం తీసుకువచ్చారని అన్నారు. పట్టణంలోని రోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారే అవకాశం ఉందన్నారు. మరో 40 కోట్ల రూపాయలకు శాసనసభ్యులు వారు ప్రతిపాదన రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరిగిందని దీంతో అభివృద్ధి



మరింత వేగంగా పరిగెడుతుందన్నారు. శాసనసభ్యులు వారి సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్తున్నామని అన్నారు.

## "స్వచ్ఛత సేవలో భాగస్వాములు కావాలి"

ప్రతి ఒక్కరు స్వచ్ఛత సేవలో భాగస్వామ్యం కావాలని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు. స్వచ్ఛత సేవా కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు. మన పరిసరాలను తిరిగే ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ఒక ప్రత్యేక దృష్టిని పెట్టారన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటామని అన్నారు. ఆరోగ్యవంతుడు కోటీశ్వరుడుతో సమానమని అన్నారు.గత నెల 27 నుండి ఈ నెల 17 వరకు ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ అమలు చేస్తుందన్నారు. దీనిలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యులు కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలు, వ్యాపారవేత్తలు అందరూ భాగస్వామ్యులై పరిసరాలను పరిశుభ్రంగా ఉండడానికి సహకరించాలని కోరారు. సెప్టెంబరు 26 కి నేను బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నాకు సహకరించిన అధికారులు రాజకీయ నాయకులు అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఒక మొక్క భవిష్యత్తుకు ఒక ఆశ

-ఏక్ పేడ్ మాకే నామ్ వృక్షారోపణ




విజయవాడ, అక్టోబర్ 1 నేటి శుభోదయ: పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం, చెట్ల ప్రాముఖ్యతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఎన్. సి. సి. క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొని మొక్కలను నాటారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యక్రమంలో తెలియజేశారు. గురువారం శ్రీ దుర్గామల్లేశ్వర సిద్దార్ధ మహిళా కళాశాల ఎన్. ఎస్. ఎస్ విద్యార్థినులు మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.వీ. దుర్గావతి, ఎన్. సి. సి. ఆఫీసర్ బి . కోమలి , అధ్యాపకులు మరియు క్యాడెట్లు కలిసి మొక్కలను నాటారు.

"ఒక మొక్క -- భవిష్యత్తుకు ఒక ఆశ" అనే సందేశంతో పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు.పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం.కళాశాల ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందించడం.విద్యార్థుల్లో మొక్కల సంరక్షణ పట్ల బాధ్యతను పెంచడం.వాతావరణ సమతుల్యతకు చెట్ల ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగిందన్నారు.సమాజంలో పర్యావరణహిత ఆలోచనలను ప్రోత్సహించడం ప్రారంభమైనదన్నారు.ఈ వృక్షారోపణ కార్యక్రమం విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను పెంపొందించడమే కాకుండా, ప్రకృతి సంరక్షణ పట్ల బాధ్యతాయుతమైన వైఖరిని అలవర్చేలా చేసింది. ఎన్. సి. సి. విద్యార్థినుల చురుకైన భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.

# యాడికిలో ఘనంగా గ్యార్మీ పండుగ వేడుకలు.. తరలివచ్చిన భక్తులు



యాడికి అక్టోబర్ 01 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండల కేంద్రంలోని వెంగమ నాయుడు కాలనీలో దస్తగిరి స్వామి కట్ట వద్ద గురువారం గ్యార్మీ పండుగ వేడుకలను కాలనీవాసులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని ఉదయం నుంచే దస్తగిరి స్వామి కట్టను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆధ్యాత్మిక వేడుకలకు స్థానిక ప్రముఖులు, నాయకులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, సామాజికవేత్త మరియు స్టాంప్ రైటర్ జూటూరు అబ్దుల్ రజాక్, అచ్చుకట్ల మాబు, జూటూరు మహబూబ్ రబ్బాని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని కాలనీవాసులతో కలిసి దస్తగిరి స్వామి కట్ట వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారికి ఘనంగా చదివింపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం నిర్వాహకులు కాలనీలో భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో యాడికి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు, కాలనీవాసులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పంక్తి భోజనాలు చేశారు. పండుగ సందర్భంగా కాలనీ అంతటా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడింది. ఈ వేడుకల నిర్వహణ ద్వారా స్థానికుల్లో పరస్పర సహకారం, ఐక్యత మరింత బలపడ్డాయని పలువురు కొనియాడారు..

# మున్సిపల్ చైర్మన్ పీఠంపై ఎస్సీలకు అవకాశం కల్పించాలి

మాచర్ల రూబెన్ మాదిగ




మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్ 01; నేటి శుభోదయ : మాచర్ల మున్సిపల్ చైర్మన్ పీఠం ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాల, మాదిగలకు అందని ద్రాక్షగా మారిందని ఎంఆర్‌పీఎస్ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మాచర్ల నియోజకవర్గం సీనియర్ నాయకులు మాచర్ల రూబెన్ మాదిగ అన్నారు. పట్టణంలో ఇప్పటివరకు వివిధ సామాజిక వర్గాలకు చైర్మన్ పదవిలో అవకాశం లభించినప్పటికీ, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాల, మాదిగలకు తగిన ప్రాధాన్యత దక్కలేదని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవి విషయంలో రెడ్డి, ఆర్యవైశ్య, వడ్డెర తదితర సామాజిక వర్గాలకు ప్రాధాన్యత లభిస్తూ వస్తోందని రూబెన్ మాదిగ అభిప్రాయపడ్డారు. జనాభా, సామాజిక ప్రాతినిధ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ సామాజిక వర్గానికి కూడా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మాల, మాదిగ సామాజిక వర్గాలకు స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, నాయకత్వ అవకాశాలను కల్పించాలని ఆయన కోరారు. అన్ని సామాజిక వర్గాలకు సమాన అవకాశాలు లభించేలా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని రూబెన్ మాదిగ విజ్ఞప్తి చేశారు.

# పీడిత మాచర్లకు మహర్దశ..!అభివృద్ధి మంత్రంతో వేల కోట్ల నిధులు..

ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి



మాచర్ల రూరల్: అక్టోబర్ 01 ; నేటి శుభోదయ :కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రెండు దశాబ్దాలుగా అభివృద్ధికి దూరంగా ఉన్న మాచర్ల నియోజకవర్గానికి మహర్దశ పట్టిందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ వేల కోట్ల రూపాయలతో వివిధ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. గురువారం మాచర్ల మండల పరిధిలోని అచ్చమ్మకుంట తండాలో నూతనంగా ఏర్పాటు చేసిన పశువైద్యశాలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.మాచర్ల నియోజకవర్గంలో తాగు, సాగునీటి సమస్యల పరిష్కారంతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజల చిరకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.గిరిజనుల పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా అర్హులైన వారికి భూమిపై హక్కులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. భూములకు పట్టాలు అందజేసే కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తామని వెల్లడించారు.అంతకుముందు అచ్చమ్మకుంట తండాకు చేరుకున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటికి గిరిజన ప్రజలు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో పార్టీ నాయకులు ధారునాయక్, కుర్రి శివారెడ్డి, మంజూలరెడ్డి, నల్లపాటి రాము, గుండా శ్రీనివాస్ యాదవ్, బృంగా రమణారావు, రాజబోయిన మధు, యెనుమల కేశవరెడ్డి, కొమెర దుర్గారావు, వీరాస్వామి, వజ్రం నాయక్, మున్నా రాంబాబు, మదార్ సాహెబ్, కంభపాటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

# గుడివాడలో ఘనంగా స్వర్గీయ నందమూరి బసవతారకం 42వ వర్ధంతి కార్యక్రమాలు

**ఎన్టీఆర్ ట్రస్ట్, వెనిగండ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో లెజెండరీ రక్తదాన శిబిరం...ముఖ్య అతిథిగా కుమారుడు నందమూరి రామకృష్ణ -రక్తదానం చేసిన 215 మంది దాతలు.**

**తల్లి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ వేదికపైనే భావోద్వేగానికి గురైన రామకృష్ణ....కన్నీటి పర్యంతం**

**-మరో జన్మ ఉంటే బసవతారకానికి సేవకుడిగా పుట్టాలని ఉంది...మహా తల్లి ఋణం తీర్చుకోలేం**

**-రక్తదాన శిబిరంలో భారీగాపాల్గొన్న విద్యార్థులు, కూటమి శ్రేణులు...రక్తదాతలకు ప్రశంసా పత్రాలు...మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**



గుడివాడ, అక్టోబర్ 1 నేటి శుభోదయ: స్వర్గీయ నందమూరి బసవతారకం 42వ వర్ధంతి కార్యక్రమాన్ని గుడివాడలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి బసవతారకం కుమారుడు నందమూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్ట్, వెనిగండ్ల ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో లెజెండరీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 215 మంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు కొనకళ్ల నారాయణరావు, రావి వెంకటేశ్వరరావు, విరంకి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు నందమూరి రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బసవతారకం వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన రక్తదాన శిబిరంలో విద్యార్థులు, కూటమి శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. రక్తదాతలకు ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున ప్రశంసా పత్రాలను నందమూరి రామకృష్ణ అందజేసి వారిని అభినందించారు. మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేసి, అనంతరం వారితో రామకృష్ణ ముఖాముఖిగా మాట్లాడారు.ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ గుడివాడలో తన మాతృమూర్తి బసవతారకం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తమ కుటుంబంపై గుడివాడ ప్రజలు చూపిస్తున్న ఆప్యాయత, అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇంతమంది స్వచ్ఛందంగా రక్తదాన శిబిరంలో పాల్గొని సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావడం అందరి సమక్షంలో మాతృమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని రామకృష్ణ పేర్కొన్నారు. భువనేశ్వరి నేతృత్వంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంక్ విజయవంతంగా సేవలందిస్తోందని, రక్తదానానికి మించిన దానం మరొకటి లేదని అన్నారు. బసవతారకం ప్రేమ, ఓర్పు, సహనానికి మారుపేరని రామకృష్ణ అన్నారు. ఆమె గురించి ఎన్నో విషయాలు చెప్పాలని ఉందంటూ మాతృమూర్తి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ సినిమా రంగంలో బిజీగా ఉన్న సమయంలో, ఊరు కాని ఊరు భాష తెలియని మద్రాసులో 25 మంది సభ్యులతో కూడిన ఉమ్మడి కుటుంబాన్ని బసవతారకం ఎంతో కష్టపడి ముందుకు నడిపించారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ఎంత కష్టపడి పనిచేసేవారో, ఆయనకు బసవతారకం అంతే చేదోడువాదోడుగా నిలిచేవారని అన్నారు. కుటుంబ బాధ్యతలను యంత్రంలా నిర్వర్తిస్తూ, ఎన్టీఆర్‌కు అండగా నిలిచారని పేర్కొన్నారు. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వస్తారన్న విషయం కుటుంబంలో ఎవరికీ తెలియదని, ఆ విషయం ఒక్క బసవతారకానికి మాత్రమే తెలుసని రామకృష్ణ చెప్పారు. టీడీపీ ఆవిర్భావం, ఎన్టీఆర్ సాధించిన అనేక విజయాల వెనుక బసవతారకం ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉందన్నారు. రాజకీయంగా ఎన్నో సవాళ్లు, కుట్రలు ఎదురైన సమయంలోనూ బసవతారకం ఎన్టీఆర్‌కు వెన్నంటి నిలిచి ధైర్యం చెప్పారని గుర్తుచేశారు.మహా తల్లి బసవతారకం రుణాన్ని ఎన్నటికీ తీర్చుకోలేమని రామకృష్ణ భావోద్వేగానికి గురయ్యారు. మరో జన్మ ఉంటే బసవతారకానికి సేవకుడిగా పుట్టాలని కోరుకుంటున్నానంటూ వేదికపైనే కన్నీటి పర్యంతమయ్యారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడ అంటే ఎన్టీఆర్ పోటీ చేసిన నియోజకవర్గం మాత్రమే కాదని, ఎన్టీఆర్ సొంత నియోజకవర్గంగా గుడివాడ ప్రజలందరూ భావిస్తారని అన్నారు. గుడివాడ గడ్డపై పుట్టి పెరిగిన ఎన్టీఆర్ పేరు తమందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. గుడివాడ అంటే ఎన్టీఆర్ ఎన్టీఆర్ అంటే గుడివాడ అనేంతగా ఈ ప్రాంతానికి ఆయనతో విడదీయరాని అనుబంధం ఉందన్నారు. ఎన్టీఆర్ జీవిత భాగస్వామి బసవతారకం కూడా గుడివాడ ప్రాంతానికి చెందినవారు కావడం గుడివాడ ప్రజలకు మరింత గర్వకారణమని అన్నారు. ఎన్టీఆర్, బసవతారకంలను గుడివాడ ప్రజలు తమ కుటుంబ సభ్యులుగానే భావిస్తారని తెలిపారు. గుడివాడ పేరును విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు ఎన్టీఆర్ అని రాము పేర్కొన్నారు. గుడివాడ టీడీపీకి పుణ్యక్షేత్రం లాంటిదని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ఖ్యాతికి సరితూగే వ్యక్తి మరొకరు లేరని, ఆయన అంతటి స్థాయికి ఎదగడంలో బసవతారకం అందించిన సహకారం, త్యాగం, ప్రోత్సాహం ఎంతటి పాత్ర పోషించాయో అర్థం చేసుకోవచ్చన్నారు. నందమూరి రామకృష్ణ తన మాతృమూర్తి గురించి చెప్పిన విషయాలు వింటుంటే బసవతారకం కుటుంబం కోసం చేసిన కష్టం, త్యాగం ఎంత గొప్పదో తెలుస్తోందన్నారు. ఎన్టీఆర్ తరువాతి తరాలు సైతం గుడివాడకు ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమని చెప్పారు.పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్ పేరుతో ఏర్పడిన ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మేలు చేసే కార్యక్రమాల్లో ఎన్టీఆర్ కుటుంబంతో కలిసి పనిచేస్తామని రాము తెలిపారు.పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక మహిళ ఉంటుందనే మాటకు బసవతారకం జీవితం నిదర్శనమన్నారు. యుగపురుషుడు ఎన్టీఆర్ అడుగడుగునా సాధించిన విజయాల వెనుక బసవతారకం అందించిన సహకారం, ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. బసవతారకం మరణించి 42 ఏళ్లు గడిచినా ఆమె జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఇంతమంది కలిసి సేవా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆమెపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. నందమూరి, నారా కుటుంబాలు ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. కృష్ణాజిల్లా టీడీపీ అధ్యక్షుడు విరంకి గురుమూర్తి మాట్లాడుతూ బసవతారకం వర్ధంతి సందర్భంగా ఇంత చక్కటి రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అభినందనలు తెలిపారు. బసవతారకం జ్ఞాపకార్థం నిర్వహించిన కార్యక్రమం ద్వారా ఎంతోమంది ప్రాణాలకు ఉపయోగపడే రక్తాన్ని సేకరించడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ ఎన్టీఆర్ రాజకీయ, సామాజిక ప్రయాణంలో బసవతారకం వెన్నుదన్నుగా నిలిచారని అన్నారు. బసవతారకానికి గుడివాడతో ఎంతో అనుబంధం ఉందని, ఆమె తన ఇద్దరు బిడ్డలకు గుడివాడలో జన్మనిచ్చారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ ప్రాతినిధ్యం వహించిన గుడివాడలోనే ఆయన జీవిత భాగస్వామి బసవతారకం వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుందన్నారు. ఈ శిబిరంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ బసవతారకం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సేవా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ రాష్ట్ర ప్రజలకు అమ్మలాంటి సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.తలసేమియా బాధితులకు మెరుగైన జీవితం అందించేందుకు భువనేశ్వరి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అమరావతిలో క్యాన్సర్ ఆసుపత్రి కూడా రాబోతోందని చెప్పారు. ఏపీ ఎస్‌డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహా తల్లి బసవతారకానికి నివాళిగా పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ సేవా భావంతో అందిస్తున్న కార్యక్రమాలు ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం నందమూరి రామకృష్ణను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కూటమి నాయకులు ఘనంగా సత్కరించారు. మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన అనంతరం రామకృష్ణ వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. బసవతారకం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరం, సేవా కార్యక్రమాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎమ్మెస్ బేగ్, గుడివాడ జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, గుడివాడ, గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ చైర్మన్లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, జనసేన అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్, నాయకులు సాయన రాజేష్, బిజెపి పార్లమెంట్ కన్వీనర్ సురే లక్ష్మీనారాయణ గాంధీ, గుడివాడ బిజెపి అధ్యక్షుడు ఆర్కే, టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, బొంబాయి శ్రీను, యార్లగడ్డ సుధారాణి, ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ మెడికల్ బృందం, గుడివాడ నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలు, టౌన్ పరిధిలోని కూటమి నాయకులు, వివిధ కళాశాలల విద్యార్థులు, పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు పాల్గొన్నారు.



## మండాది బోడు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**బైక్‌ను ఢీకొట్టిన కారు.. రామయ్య అక్కడికక్కడే దుర్మరణం**



మాచర్ల, అక్టోబర్ 1:లిఆర్ సి ఇన్చార్జ్ నేటి శుభోదయ : పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని మండాది బోడు సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరిని గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ప్రకాశం జిల్లా కొమ్మరోలుకు చెందిన రామయ్య (28) అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న మరో వ్యక్తి రమేష్ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే అతడిని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామయ్య, రమేష్ నాగార్జునసాగర్‌లో పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు గుర్తించి మాచర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాదానికి గురైన బైక్‌తో పాటు మరో వాహనాన్ని కూడా స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఘటనపై మాచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.





## గోకవరం దేవి చౌక్ ఆలయ వివాదం దాతల గౌరవంపై ప్రతినిధుల స్పష్టత...!

కోరుకొండ, అక్టోబర్ 1, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)- దేవి చౌక్ అమ్మవారి ఆలయ నిబంధనలు, దాతల ప్రాధాన్యతపై తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఆలయ సేవకులు, కమిటీ ప్రతినిధులు అత్యవసర ప్రెస్ మీట్ నిర్వహించి వివరాలను వెల్లడించారు. ముఖ్యంగా ప్రముఖ దాత, సామాజిక వేత్త కంబాల శ్రీనివాసరావు (కంబాల శీను) గారిని ఉద్దేశిస్తూ 14 నిబంధనలతో కూడిన ఒక ముసాయిదా లేఖను కొందరు తయారు చేశారని ప్రతినిధులు తెలిపారు. ఆలయ సేవకులు అందులో కొన్ని సవరణలు సూచించినప్పటికీ, ఆ సవరించని పాత నిబంధనల కాగితాన్ని సామాజిక మాధ్యమాలు (వాట్సాప్) ద్వారా బహిర్గతం చేయడం సరికాదని మండిపడ్డారు. దీనివల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్లి ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉన్నందునే ఈ వివాదంపై స్పష్టత ఇచ్చేందుకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు:గోకవరం గ్రామానికి చెందిన కంబాల శ్రీనివాసరావు దేవి చౌక్ ఆలయంతో పాటు ఊరిలోని సత్యనారాయణ స్వామి ఆలయం, శివాలయం అభివృద్ధికి కోట్లాది రూపాయల విరాళాలు అందించారని గుర్తుచేశారు. 50 లక్షల వ్యయంతో దేవి చౌక్ అమ్మవారికి అద్భుతమైన రథాన్ని తయారు చేయించారు.అమ్మవారికి 14 లక్షలతో స్వర్ణ కిరీటం చేయించడమే కాకుండా, దాదాపు 1.50 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న బంగారు చీర ప్రాజెక్ట్‌ను కూడా ప్రారంభించారు. వారానికోసారి 20,000 ఖర్చుతో ఉచిత ప్రసాద వితరణతో పాటు, గతంలో ఆలయానికి ఉన్న ?4 లక్షల బాకీని కూడా స్వయంగా తీర్చారని వివరించారు.



**దాతల హక్కులను కాపాడాలి:**

ప్రధానమంత్రి నుంచి ముఖ్యమంత్రుల వరకు రూ.10 లక్షలు ఇచ్చిన దాతలను కూడా వేదికపైకి పిలిచి గౌరవించే సంప్రదాయం ఉందని, ఆలయానికి రూ.500 ఇచ్చినా, లక్షలు ఇచ్చినా ప్రతి దాతకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కమిటీ నేతలు అభిప్రాయపడ్డారు. దాతలకు ప్రాధాన్యత తగ్గితే వ్యవస్థ దెబ్బతింటుందని హెచ్చరించారు. ఈ ఏడాది అమ్మవారి ఉత్సవాల పీఠంపై దాతతో పాటు మరొకరిని కూర్చోబెట్టాలనే ఆలోచనపై పంచాయితీ నడుస్తోందని, "ఈ రోజు ఒక పెద్ద దాత నచ్చలేదని పక్కన పెడితే, రేపు మరొకరిని వదిలేస్తారని" పేర్కొన్నారు. స్వార్థ రాజకీయాలకు తావివ్వకుండా, ఆలయ వైభవాన్ని పెంచిన దాతల గౌరవాన్ని కాపాడుకోవాలని ఆలయ సేవకులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా వాసవి క్లబ్ ఫార్మేషన్ డే వేడుకలు




మాచర్ల: ఆర్ సి ఇన్చార్జ్ అక్టోబర్01; నేటి శుభోదయ మాచర్ల: వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ ఫార్మేషన్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా వాసవి క్లబ్ వ్యవస్థాపకులు క్రీస్తుశేషులు కల్వకుంట చంద్రశేఖర్ గుప్తా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వాసవి క్లబ్ పూర్వ అధ్యక్షులు తిరివీధుల వెంకట నాగేశ్వరరావు, మేడం నాగేశ్వరరావు, ఓరుగంటి చెన్నకేశవరావు, కాసుల ప్రసాద్ రావులను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. సమాజ సేవలో వాసవి క్లబ్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు చుండూరు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బచ్చు రాజ్‌కుమార్‌తో పాటు క్లబ్ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ తో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భేటీ

**జిల్లాలో పలు అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు నిధులు కోరుతూ లోకేష్ కి వినతి**

**జిల్లా రాజకీయాలపై లోకేష్ తో ఎంపీ చర్చలు**

**ఏలూరు పార్లమెంట్ లో గత రెండేళ్లు" చేసిన అభివృద్ధి పనుల పుస్తకాన్ని లోకేష్ కి అందించిన ఎంపీ**



ఏలూరు, అక్టోబర్ 01, నేటి శుభోదయ ::: రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ భేటీ అయ్యారు. గురువారం సాయంత్రం ఉండవల్లి నివాసానికి వెళ్లిన ఎంపీ, జిల్లాలోని తాజా రాజకీయ పరిస్థితులను చర్చించడంతోపాటు, ఏలూరు పార్లమెంట్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాల్సిందిగా కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువచ్చిన అంశాల్లో ముఖ్యంగా.. ఏలూరులో బీసీ హాస్టల్ నిర్మాణానికి 2 కోట్లు, ఏలూరు పట్టణంలో జిల్లా గ్రంథాలయం నిర్మాణానికి 3 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కొయ్యలగూడెంలో ఫైర్ స్టేషన్ నిర్మాణానికి ఆర్థిక శాఖ నుంచి ఫైనాన్సియల్ క్లియరెన్స్ ఇప్పించమని కోరిన ఎంపీ, నూజివీడు ××లో ఆధునీకీకరణ, సౌకర్యాల కల్పనకు 12 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఇచ్చిన వినతిపత్రంలోని అంశాలను పరిశీలించిన మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఏలూరు పార్లమెంట్ పరిధిలోని రాజకీయ పరిస్థితులు, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా ఇరువురూ కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా గత రెండేళ్లలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఏలూరు పార్లమెంటు పరిధిలో చేసిన అభివృద్ధి పనులు, కార్యక్రమాల వివరాలతో రూపొందించిన పుస్తకాన్ని నారా లోకేష్ కి అందించారు. పుస్తకాన్ని పరిశీలించిన లోకేష్ చేసిన పనులను ఇలా పుస్తక రూపంలో తేవడం బాగుందంటూ ప్రశంసించారు.

## ఎన్నికల వ్యవస్థ పరిరక్షణకు కర్నూలులో నిరసనకు పిలుపు

**ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్**

**అక్టోబర్ 2న అంబేద్కర్ సర్కిల్ వద్ద ధర్నా**




, కర్నూలు, అక్టోబర్ 1:ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కర్నూలులో నిరసన--ధర్నా నిర్వహించనున్నట్లు సామాజిక న్యాయం కోసం జాతీయ న్యాయవాదుల వేదిక (నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్) ప్రకటించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 2వ తేదీన శుక్రవారం కర్నూలు పాత బస్టాండ్‌లోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎన్నికల వ్యవస్థ, ప్రజాస్వామ్యానికి సంబంధించిన తమ అభ్యంతరాలను ప్రజల దృష్టికి తీసుకురావడమే కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ నిరసన కార్యక్రమానికి న్యాయవాదులు, పౌర సమాజ నాయకులు, విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్య శక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నేషనల్ లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ పిలుపునిచ్చింది.

## చేనేత కార్మికుల గొంతుకగా సాన శ్రీనివాసులు

**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నూతన బాధ్యతలు**

**బుట్టా రేణుక అభినందనలు**

కర్నూలు, అక్టోబర్ 1:వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన మాజీ కార్పొరేటర్ సాన శ్రీనివాసులు పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ బుట్టా రేణుకను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు చేపట్టిన సాన శ్రీనివాసులకు బుట్టా రేణుక హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి హక్కులు, సంక్షేమం, ఉపాధి అవకాశాల కోసం అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా చేనేత రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మికుల ఉపాధి, సంక్షేమ పథకాలు, మార్కెటింగ్ సదుపాయాలు తదితర అంశాలపై చర్చించారు. చేనేత కార్మికుల సమస్యలను బలంగా వినిపిస్తూ, వారి ప్రయోజనాల కోసం నిరంతరం పనిచేయాలని సాన శ్రీనివాసులకు బుట్టా రేణుక సూచించారు.నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ చేనేత కార్మికులకు అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆమె ఆకాంక్షించారు.

## జీజీహెచ్‌లో మరో అధునాతన వైద్య పరికరం

**రూ.29.30 లక్షల హై రెజల్యూషన్ ఎసోఫేజియల్ మానోమెట్రీ ప్రారంభం**

**కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాం: మంత్రి టీజీ భరత్ గుప్త**

**ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలి**

కర్నూలు, అక్టోబర్ 1:కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో వైద్య సేవలను మరింత ఆధునీకరిస్తూ రూ.29.30 లక్షల విలువైన హై రెజల్యూషన్ ఎసోఫేజియల్ మానోమెట్రీ పరికరాన్ని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ. భరత్ గుప్త గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాయలసీమలోనే కాకుండా రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో లేని ఈ అధునాతన పరికరాన్ని కర్నూలు జీజీహెచ్‌కు తీసుకురావడం జరిగిందన్నారు. దీని ద్వారా జీర్ణవ్యవస్థకు సంబంధించిన పలు సమస్యలను అత్యంత ఖచ్చితంగా గుర్తించి, మెరుగైన చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇదే తరహా పరీక్షకు సుమారు రూ.10 వేల వరకు ఖర్చవుతుందని, హైదరాబాద్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకుంటే దాదాపు రూ.40 వేల వరకు వ్యయం అయ్యే అవకాశం ఉందన్నారు. అయితే జీజీహెచ్‌లో ప్రజలకు ఈ సేవలు ఉచితంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు.కర్నూలు జీజీహెచ్‌లో నిపుణులైన వైద్యులు, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆస్పత్రిని కార్పొరేట్ స్థాయి ఆస్పత్రిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అవసరమైన అధునాతన పరికరాలు, మౌలిక వసతులను సమకూరుస్తున్నామని తెలిపారు.రూ.2.5 కోట్లతో భవనాల మరమ్మతులుజీజీహెచ్‌లోని అనేక భవనాలు సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించినవేనని మంత్రి తెలిపారు. గతంలో వర్షపు నీరు భవనాల్లోకి చేరి విలువైన వైద్య పరికరాలకు నష్టం కలిగే పరిస్థితి ఉండేదన్నారు. దీనిని నివారించేందుకు సుమారు రూ.2.5 కోట్లతో భవనాల మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో ఎన్డీఏ ప్రభుత్వం ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని, ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.మంత్రి చొరవతో ఆస్పత్రికి ఎంతో మేలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆస్పత్రి అభివృద్ధికి ఇంకా ఏం చేయాలనే అంశంపై మంత్రి టీ.జీ. భరత్ గుప్త ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు.

ఆస్పత్రి భవనాలు వర్షాలకు కారుతున్న విషయం మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, సుమారు రూ.2.5 కోట్లతో మరమ్మతులు చేయించారని తెలిపారు. దీనివల్ల ఆస్పత్రి డెవలప్‌మెంట్ ఫండ్‌ను ఇతర అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అత్యంత సూక్ష్మంగా పరీక్షలకు అవకాశం ఎండోక్రైనాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. రాయలసీమలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ పరికరం అందుబాటులో లేదని తెలిపారు. ఈ పరికరం ద్వారా ఎండోస్కోపీ, కొలనోస్కోపీకి సంబంధించిన పరీక్షలతో పాటు రోగి సమస్యను మరింత సూక్ష్మంగా అంచనా వేసి చికిత్స అందించేందుకు వైద్యులకు సహకారం లభిస్తుందని వివరించారు.

ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గ్యాస్ట్రో ఎంటరాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మోహన్ రెడ్డి, విశ్రాంత వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కిరణ్ కుమార్, ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, సాయి ప్రదీప్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.